PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 18.05.2012, శుక్రవారం సంపుటి : 31 సంచిక : 50 పేజీలు : 16, వెల : ₹ 4

24గం॥ చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ఏకైక చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్

నెలలు తక్కువ బిడ్డా ? సంరక్షణ కొరకు...

పుట్టిన పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (NICU)



Dr. T. Ravikumar's

రిచ్ హాస్పిటల్

రవి చిన్నపిల్లల హాస్పిటల్

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## అకౌంట్లు ఫ్రీజ్.. ఆస్తులు సీజ్.. పెట్టుబడిదారులను చేజ్..

## అయినా... తగ్గని

## క్రేజ్

సోనియాను త్రోసి 'రాజ'న్నాడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి. ఆమె అహం దెబ్బతింది. పగ బుస కొట్టింది. కాలంను కాల నాగును చేసి కాటేయిం చేందుకు సిద్ధమైంది. సిబిఐ అస్త్రం ప్రయోగించింది. జగన్ అక్రమాస్తుల పుట్టను త్రవ్వసాగారు.

నువ్వెంత? నీ అధికారం ఎంత? ఆంధ్రరాష్ట్రంలో నా తండ్రి వైయస్సార్ లేకుంటే కాంగ్రెస్‌పార్టీ కుదేలై పోయివుండేది. ఢిల్లీ నాయకులకు షాక్ ఇవ్వండి... అంటూ జనంలో కలిసిపోయాడు జగన్.

జనంలోకి వెళ్లిన జగన్‌ను జనం నుంచి వేరు చేయాలంటే ఏం చేయాలి? అక్రమార్జన తుట్టెను కదిలించింది. అక్రమాస్తుల కేసు పేరుతో విచారణలు, ఛార్జిషీట్‌లు. మొదటివేటు సాయిరెడ్డి మీద. తర్వాత సాక్షి మీడియా బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేయటం. ఆస్తులను అటాచ్ చేయడం, తదనంతరం ఈ నెల 28వ తేదీన కోర్టుకు హాజరుకమ్మంటూ సమ్మన్ల జారీ. తొణకకుండా జనంలో చొచ్చుకుపోతూ ధర్మాగ్రహం అంటూ నిప్పులు చెరుగుతున్న జననేత తనయుడిని బెర్ముడా ట్రయాంగిల్‌గా మారి లాక్కొంటూ వుంది అధినేత్రి. అకౌంట్లు ఫ్రీజ్ చేశారు. ఆస్తులను సీజ్ చేస్తూనే పెట్టుబడిదారులను చేజ్ చేస్తున్నారు.

అందులో భాగమే మ్యాట్రిక్స్ ప్రసాద్‌గా లబ్ధ ప్రతిష్టుడైన రాష్ట్రంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్‌ను, ఆయనకు 'వాన్‌పిక్' అనుమతులను ఇవ్వటంలో అత్యుత్సాహంతో విధులు నిర్వహించిన ఇండియన్ రెవెన్యూ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ అధికారి బ్రహ్మానందరెడ్డిని అనూహ్యంగా ముగ్గులో దించి అరెస్టు చేసింది సిబిఐ. 15వ తేదీ రాత్రి రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలెవ్వరూ నిద్ర పోలేదు. ప్రత్యేకించి వై.యస్.కుటుంబంతో సన్నిహిత సంబంధాలున్నవారు వణికిపోయారు. మొదట రెండవ నిందితుడు, ఇప్పుడు 12వ నిందితుడు. మరి ఒకటవ నిందితుడి అరెస్టు 28వ తేదీనా? పెద్దప్రశ్న, అయినా, కాకపోయినా ఎప్పుడో ఒకరోజు జగన్ అరెస్టు తథ్యం అనేది ఈ అరెస్టుల పరంపర చెప్పకనే చెపుతుంది. రాష్ట్రంలో 18అసెంబ్లీ స్థానాలకు ఒక పార్లమెంటు స్థానానికి ఎన్నికలు (మిగతా 10వ పేజీలో)

## సర్వమతం.. నా అభిమతం

(వివరాలు 11వ పేజీలో)



## కాంగ్రెస్ హస్తం... మీ నేస్తం




(వార్త లోపలి పేజీల్లో)

## 'దేశం' పిలుస్తోంది.. రండి... కదలిరండి!



(వార్త లోపలి పేజీల్లో)



ఆయన ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్నప్పుడు చూపంతా విదేశాలమీదే వుండేది. మాటంతా అంతర్జాతీయ స్థాయిలో వుండేది. అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్‌తో మాట్లాడేవాడు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌ను రాష్ట్రానికి తీసుకొచ్చేవాడు. సింగపూర్, మలేషియా, దుబాయ్ వంటి దేశాధి నేతలతో మంతనాలు సాగిస్తుండేవాడు.

## నాడు క్లింటన్... నేడు కృష్ణ

## స్థాయి తగ్గుతోంది..!

రాష్ట్ర రాజకీయాలన్నా, రాష్ట్రంలో నాయకులన్నా ఆయనకు తన గడ్డం మీద వెంట్రుకతో సమానం. జాతీయస్థాయిలో నాయకులు ఎప్పుడూ ఈయన అపాయింట్ మెంట్ కోసం ఎదురుచూస్తుండేవాళ్లు. ఆ స్థాయిలో తిరిగాడు మన తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు.

మరి ఇప్పుడో... బిల్ క్లింటన్‌తో మాట్లాడిన నోటితో మంగలి కృష్ణ గురించి గంట మాట్లాడుతున్నాడు. ఒకప్పుడు ఢిల్లీ రాజకీయాలను శాసించిన ఈ తెలుగు వీరుడు ఇప్పుడు గల్లీ స్థాయి నాయకులను గంటలకొద్దీ విమర్శిస్తున్నాడు. పూలమ్మిన చోట కట్టెలమ్ముకోవడమంటే ఇదే కదా? రత్నాలమ్మిన వ్యక్తి రాళ్లు కొట్టుకుని బ్రతకడమంటే ఇదే కదా!

ఇటీవలకాలంలో చంద్రబాబు తన స్థాయికి దిగజారి చేస్తున్న విమర్శలు అంతగా రాజకీయం పరిజ్ఞానం లేని వారిని సైతం విస్మయానికి గురిచేస్తున్నాయి. రాజకీయాలలో బ్రతికిచెడిన వ్యక్తి చంద్రబాబు. ఈ రాష్ట్ర రాజకీయచరిత్రలో ఆయనకొక గుర్తింపు వుంది. కాసు బ్రహ్మానందరెడ్డి తర్వాత ఈ రాష్ట్రాన్ని ఎక్కువ కాలం ఏలిన వ్యక్తి. జాతీయ రాజకీయాలను సైతం ప్రభావితం చేసిన నాయకుడు. రాజకీయాలలో ఒక స్థాయిని మెయింటెన్ చేసినవాళ్లు ప్రతికూల పరిస్థితుల్లో కూడా దానిని అలాగే కొనసాగిస్తే హుందాగా వుంటుంది. ఆకలేసినంత మాత్రాన మాంసం దొరకలేదని సింహాలు గడ్డి తినవు కదా!

కాని చంద్రబాబు రెండుసార్లు అధికారానికి దూరమయ్యాననే ఆత్మన్యూనతా భావంతోనేమో తన స్థాయిని దిగజారి మాట్లాడుతున్నాడు. తిరుపతిలో ఒక భూవివాదానికి సంబంధించి మంగలి కృష్ణపై ఆయన (మిగతా 10వ పేజీలో)

PDF Compressor Free Version



# నేతలకు నేత... రామదూత

## వివిఐపిస్వామి సేవలో తరిస్తున్న వివిఐపిలు



ఈరోజుల్లో స్వాములు, బాబాలకు వున్న ఫాలోయింగ్ హాలీవుడ్ హీరో హీరో యిన్‌లకు కూడా లేదు. పేరుమోసిన ప్రజాప్రతినిధులకు కూడా అంత క్రేజ్ వుండడం లేదు. జనం తమ సమస్యలు పరిష్కరించండని ప్రజాప్రతినిధులు, ఉన్న తాధికారుల మీద పడుతుంటే, వాళ్లు మాత్రం ఈ బాబాలు, స్వామీజీల కాళ్లకు మొకరిల్లుతుంటారు. బాబాలు, స్వామీజీల అవతారం సకలసంపదలకు ఒక మార్గమై పోయింది. స్వామీజీల మునుగులో కొందరు ఎలాంటి పాడుపనులకు పాల్పడ తుంటారో బెంగుళూరులో నిత్యానందస్వామి రాసలీలల వ్యవహారంతో రట్టయ్యింది.

ఈ స్వామీజీలు హైందవ ధర్మాన్ని ప్రచారం చేస్తూ, ధనిక, పేద, కుల, వర్గాల తేడాలేకుండా భక్తులను సమదృష్టితో చూస్తే బాగుంటుంది. ఈరోజు ఎంతోమంది దళితులు, గిరిజనులు హైందవంలో వున్న కులతత్వ పోకడలను తట్టుకోలేక అన్య మతాల్లోకి వెళుతున్నారు. విశాఖ ఏజన్సీ ప్రాంతంలో ఇలా అన్యమతం తీసుకున్న గిరిజనులను తిరిగి హిందూమతంలోకి తీసుకొచ్చి శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపా నందేంద్రస్వామి తాను నమ్మిన హైందవ సంస్కృతికి ఎంతో కొంత మేలు చేసాడు. కాని చాలామంది స్వామీజీలు కేవలం విఐపి భక్తులకే ప్రాధాన్యతనిస్తూ హైందవ సంస్కృతికి చీడపురుగులవుతున్నారు.

నెల్లూరుజిల్లా సరిహద్దుల్లో ప్రకాశం జిల్లా పరిధిలోకి వచ్చే గుడ్లూరు మండలం చేవూరు వద్ద విఐపి స్వామి ఒకరున్నారు. ఆయనే రామదూత. ఆయన తరచూ వేణు దత్త సువర్ణలక్ష్మీ దాంపత్యవ్రతమహా యాగాలు నిర్వహిస్తుంటారు. ఆ యాగాలకు కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులు, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు, పారి శ్రామికరంగ ప్రముఖులు పెద్దఎత్తున వస్తుంటారు. సెంటిమెంట్‌తో ముడిపడివున్న అంశం కాబట్టి దీన్ని కొట్టిపారేయలేము. కాకపోతే భక్తి భావంలోనూ ఇక్కడ తేడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఈ రామదూత ఆశ్రమానికి గతంలో కర్నాటక ముఖ్య మంత్రిగా వున్న యడ్యూరప్ప హెలికాప్టర్ వేసుకుని రావడం జరిగింది. కేంద్ర రైల్వేశాఖ సహాయమంత్రి మునియప్ప అయితే ఈయనకు మహాభక్తుడు. గతంలో డిజిపిగా పనిచేసిన గిరీష్‌కుమార్, డిజిపి బాధ్యతలు తీసుకున్న వెంటనే రామదూత పాదాలపై పడి విమర్శలపాలయ్యాడు. తరచూ ఈ ఆశ్రమానికి వివిఐపిల తాకిడి అధికంగానే వుంటుంది.

ఈ నెల 14వతేదీ కూడా ఆశ్రమంలో శ్రీ వేణుదత్త సువర్ణలక్ష్మీ దాంపత్య వ్రత మహాయాగం నిర్వహించారు. బీజేపీ జాతీయ నాయకులు మురళీమనోహర్‌జోషి, రాష్ట్రమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, జె.గీతారెడ్డి, బసవరాజు సారయ్య, డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎంపీ పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి వంటి వివిఐపిలు హాజ రయ్యారు. వీరంతా రామదూత కాళ్లపై పడి ఆశీస్సులు తీసుకున్నారు. ఇద్దరు మంత్రులు, నలుగురు ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు, పదిమంది విదేశీ భక్తులను సెట్ చేసుకుంటే చాలు... ఆ స్వామీజీ ఇట్టే ఫోకస్ అయిపోతాడు. ఈ బాబాలకు డబ్బు బాగానే వస్తుంది. ఆ డబ్బును వారు దళిత గిరిజన పేదల మంచికి ఉపయోగిస్తే హైందవ ధర్మాన్ని ఆ విధంగానన్నా ప్రజలకు చేరువచేసినవాళ్లవుతారు. స్వామీజీలు వివిఐపి భక్తుల కోసం కాదు... సామాన్య జనం కోసం కొంత సమయం కేటాయిస్తే హైందవం నుండి కొనసాగు తున్న మత మార్పిడులను కనీసం ఆప గలుగుతారు. "ధర్మో రక్షతి రక్షితః"

# ఉపఎన్నికల్లో నెల్లూరు కీలకం!

## పార్టీల కోసం కాదు ప్రజల కోసమే పోలీసు

**- సమీక్షా సమావేశంలో డిజిపి వి.దినేష్‌రెడ్డి**



రాష్ట్రంలో ఒక లోక్‌సభ, 18 అసెంబ్లీలకు జరుగనున్న ఉపఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా పోలీసుశాఖాపరంగా అత్యంత కీలకమైన సమావేశాన్ని 14వ తేదీ నెల్లూరులో నిర్వహించారు. రాష్ట్ర డిజిపి వేణుంబాక దినేష్‌రెడ్డి నిర్వహించిన ఈ సమావేశానికి కోస్తాంధ్ర డిఐజి, గుంటూరురేంజ్ ఇన్‌ఛార్జ్ ఐ.జి కె.వి.రాజేంద్ర నాథ్‌రెడ్డి, రాయలసీమ డిఐజి గోవిందస్వామి, అనంతపురం రేంజ్ డిఐజి చారుసిన్హా నెల్లూరు ఎస్పీ బి.వి.రమణకుమార్, ప్రకాశం ఎస్పీ రఘునాథ్‌రెడ్డి, తిరుపతి అర్బన్ ఎస్పీ ప్రభాకర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఉపఎన్నికలలో శాంతిభద్రతల నిర్వహణపై డిజిపి దినేష్‌రెడ్డి వారితో చర్చించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో డిజిపి మాట్లాడుతూ ఉపఎన్నికలలో నెల్లూరుజిల్లా కీలకంగా మారిందని, ఒక అసెంబ్లీతో పాటూ లోక్‌సభకు ఎన్నికలు జరుగుతున్నందున శాంతిభద్రల విషయమై ప్రత్యేకదృష్టిని కేంద్రీకరించామన్నారు. పోలీసులు ఏ పార్టీకో, ఏ వర్గానికో కొమ్ము కాయరు. మేం ప్రజల కోసం పనిచేస్తాం. ప్రజాస్వామ్య పద్ధతుల్లో విధులు నిర్వహిస్తాం. ప్రజలు స్వేచ్ఛగా ఓటేసే వాతావరణం కల్పిస్తాం. ఓట్ల కోసం డబ్బు ఇచ్చే వాళ్లమీదే కాదు, తీసుకునేవాళ్లమీద కూడా కేసులు నమోదుచేస్తామని ఆయన హెచ్చరించారు. మద్యం, నగదు పంపిణీని నియంత్రిస్తాం. ప్రజలు కూడా తమ దగ్గరలో ఎక్కడన్నా మద్యం, డబ్బు పంపిణీ జరుగుతుందని తెలిస్తే నెల్లూరుజిల్లా వాళ్లు 1098, తిరుపతి వాళ్లు 1091, ప్రకాశంజిల్లా ప్రజలు 100కు ఫోన్‌చేసి సమాచారమందించాలి. సమాచారమిచ్చిన వారి పేర్లు గోప్యంగా వుంచుతామని ఆయన భరోసా ఇచ్చారు. ఉపఎన్నికల దృష్ట్యా నెల్లూరులో 18, తిరుపతిలో 31, ప్రకాశంలో 16 తనిఖీ కేంద్రాలను, 25 మొబైల్ పార్టీలు, 73 పోలీస్ పికెటింగ్ కేంద్రాలు నెలకొల్పాము. బందోబస్తులో 9వేలమంది ఏఆర్ పోలీసులు, 44 కంపెనీల బలగాలు పాల్గొంటు న్నాయి. ఎన్నికలను పూర్తి శాంతియుత వాతావరణంలో నిర్వహిస్తామన్నారు.

### సుబ్బరామిరెడ్డికి వెన్నుదన్నుగా, కొండంత అండగా...

# వెల్లువెత్తిన అభిమానం... పోటెత్తిన మెగాసైన్యం



తిక్కవరపు, ఆనం, ముంగమూరులను గజమాలతో సత్కరిస్తున్న చిరు అభిమానులు

**చిరు అభిమానులే నా హీరోలు - టి.యస్.ఆర్**



సమావేశానికి హాజరైన చిరుసైన్యం

అమెరికా సైన్యంలో సీల్ కమెండోలు, భారత సైన్యంలో ఎన్ఎస్‌జి కమెండోలు ఎంత శక్తివంతంగా వుంటారో ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీకి మెగాస్టార్ చిరంజీవి అభిమానులు అంతటి శక్తివంతమైన కమెండోలుగా మారారు. సినీ అభిమానం డబ్బు కోరదు... పదవులు కోరదు. అధికారంలోకి వచ్చాక 'సెజ్'లు కావాలని కోరదు. తమ హీరో రాజకీయాలలో కూడా హీరోగా వెలగాలనే కోరుకుంటుంది. మెగాస్టార్ చిరంజీవి అభిమానులే ఈరోజు కాంగ్రెసపార్టీకి వీరసైన్యంగా, కొండంత గుండెధైర్యంగా నిలిచారు. చిరంజీవి ఒక్క పిలుపునిస్తే చాలు... ఈ అభిమాన సైన్యం ఎంతకైనా పోరాడుతుంది. అలాంటి సైన్యంతో ఆదివారం నెల్లూరు మాగుంట లే-అవుట్‌లోని సిపిఆర్ కళ్యాణ మండ పంలో సమావేశం నిర్వహించారు. చిరంజీవి యువత ఆధ్వర్యంలో చిరంజీవి అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తల సమన్వయ సమావేశం జరుగగా చిరంజీవి అభిమానులు పెద్దఎత్తున ఈ కార్యక్ర మంలో పాల్గొన్నారు. నెల్లూరు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డా॥ టి.సుబ్బరామిరెడ్డికి మద్దతుగా పనిచేస్తామని, ఆయన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని ఈ సందర్భంగా చిరంజీవి అభిమానులు వాగ్దానం చేసారు. తమ హీరో చిరంజీవిని కాంగ్రెస్ పార్టీ ఎంతగానో నమ్ముకుందని, ఆయనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిల బెట్టడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు అభిమానులు.

కాంగ్రెస్ అభ్యర్థి టి.సుబ్బరామిరెడ్డి తన ప్రసంగంలో చిరంజీవి అంటే మీకే కాదు, నాకూ అభిమానమేనన్నారు. తాను అభిమానించే వ్యక్తుల్లో చిరంజీవికి ప్రత్యేక స్థానముందని చెప్పారు. చిరంజీవి లాంటి మంచి వ్యక్తి తన ఆశయసాధనకు రాజకీయమార్గంగా కాంగ్రెస్‌పార్టీని ఎంచుకున్నాడంటే ఆ పార్టీ ఎంతగొప్పదో అర్థం చేసుకోవాలన్నారు. చిరంజీవి అభి మానులు నన్ను ఆశీర్వదిస్తే, వారిని జీవి తాంతం తన గుండెల్లో పెట్టుకుని కాపాడు కుంటానన్నారు.

ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి చిరు అభిమాని ఠాగూర్‌లా మారి అవినీతిపరుల పాలిట సింహస్వప్నం కావాలన్నారు. ప్రేమే లక్ష్యం, సేవే మార్గం అన్న చిరంజీవి ఆశయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, కాంగ్రెస్ ద్వారా ఆయన ఆశయాన్ని ఆచరణలోకి తేవాలన్నారు. మీ చిరంజీవి, మా చిరంజీవి, నిన్నటిదాకా ఈ రాష్ట్ర ప్రజల చిరంజీవి, ఇప్పుడు జాతీయ స్థాయిలో దేశప్రజలందరి చిరంజీవిగా మారాడ న్నారు. ఎంపీగా పోటీచేస్తున్న సుబ్బ రామిరెడ్డి వెంట చిరు అభిమానులు మెగా సైన్యంలా నడవాలని మంత్రి కోరారు.

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, మేకపాటి సోదరులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సుబ్బ రామిరెడ్డిని గెలిపించి చిరంజీవి సత్తా ఏంటో ప్రత్యర్థులకు చూపించాలని నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి అభిమానులకు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయ కులు చాట్ల నరసింహారావు, మాదాసు గంగాధరం, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చిరు అభిమాన సంఘాల నాయకులు పి.చంద్రశేఖర్‌రెడ్డి, కొట్టే వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, టోనీ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చిరంజీవి యువత గౌరవాధ్యక్షులుగా సరయు ఆటో మొబైల్స్ అధినేత రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

PDF Compressor Free Version



# బుద్ధిగా మెలగండి

## పార్టీ నేతలకు క్లాసుపీకిన వై.వి.సుబ్బారెడ్డి

నెల్లూరుజిల్లా వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాల పట్ల ఆ పార్టీ కేంద్ర పాలకమండలి సభ్యుడు, జగన్ బాబాయ్ వై.వి.సుబ్బారెడ్డి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం. 11వ తేదీ నెల్లూరు నగరానికి వచ్చిన సుబ్బారెడ్డి పార్టీ పటిష్టత కోసం అందరూ కలసి పనిచేయాలే తప్ప ఆధిపత్యం కోసం పోట్లాడుకోవడం మంచిదికాదని మందలించాడు. 'జగన్', అడిన మాటకు కట్టుబడే వ్యక్తని, ముందుగా ఎవరికైతే టిక్కెట్ల విషయంలో మాటిచ్చాడో ఆ మాటకే కట్టుబడి వుంటాడని, నెల్లూరు నగరం మరియు గ్రామీణం నియోజకవర్గాలలో ఇప్పటికే అభ్యర్థుల నిర్ణయం జరిగిపోయిందని, రేపటి ఉపఎన్నికల తరువాత ఆ పేర్లను అధికారికంగా పార్టీ ప్రకటిస్తుందని, ఈలోగా ఎవరికి వారే తామే అభ్యర్థులమని ప్రకటించుకుని పార్టీ కార్యకర్తలను, అభిమానులను అయోమయంలో పడవేయొద్దని గట్టిగానే మందలించినట్లు వార్త.



పేరుకి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడైనప్పటికీ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోనూ గోవర్ధన్‌రెడ్డి ప్రోత్సహించే వ్యక్తులకు పోటీగా 'మేకపాటి' సైన్యం తయారు అవుతుందన్న సమాచారం హైదరాబాదుకు చేరడంతో హుటాహుటిన నెల్లూరుకు వచ్చిన వై.వి.సుబ్బారెడ్డి నేతలందరిని ఒక చోటకు చేర్చి క్లాసుపీకాడు.

అందరి లక్ష్యం పార్టీని అధికారంలోకి తేవడమేనని, ఎక్కడికక్కడ ఎవరికివారే 'పార్టీ' అనే విధానంతో పనిచేయడం మంచి పద్ధతి కాదని, పార్టీలోకి వచ్చే ప్రతి కార్యకర్త ప్రతి నాయకుడు పార్టీ ప్రయోజనాల కోసం పనిచేయాలే తప్ప వ్యక్తిగత ఆధిపత్యాన్ని ప్రదర్శించాలనే ప్రయత్నం చేయడం తప్పని ఆయన అన్నట్లు తెలిసింది. పార్టీని భ్రష్టు పట్టించకుండా బుద్ధిగా మెలగండని ఇరువర్గాల వారినీ మందలించాడు.

ఇప్పటికైనా నేతలు తమ తీరు మార్చుకుని ఎండనకా వానకా, ఇల్లు, వాకిలీ వదిలి జనంలో తిరుగుతున్న 'జగన్' ఆశయం కోసం పనిచేస్తే మంచిది.

• ఒంగోలు కాంగ్రెస్

# వదిన ప్లస్... మరిది మైనస్!

ఒంగోలులో కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి, పార్టీ నాయకులు, కార్యకర్తల మనస్థితి అయోమయంలో వుంది. స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి అందించిన అభివృద్ధి ఫలాలు, ఇదే ప్రాంతంలో అశువులు బాసిన ఆయన జ్ఞాపకాలు ప్రకాశంజిల్లాలో ముఖ్యంగా ఒంగోలు నియోజకవర్గంలో పార్టీకి బలం కాగా, తదుపరికాలంలో ఆయన సోదరుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి నాయకత్వం ఇక్కడ పార్టీని బలహీనంగా మార్చిందని రాజకీయ మేధావుల విశ్లేషణ. సుబ్బరామిరెడ్డి భార్యగా మాగుంట పార్వతమ్మ అభ్యర్థిత్వం ఇక్కడ బలమైందిగా పార్టీ వర్గాలు భావిస్తున్నప్పటికీ, శ్రీనివాసులరెడ్డి పనితీరుపట్ల, పార్టీలోని కార్యకర్తలు, నాయకుల పట్ల ఆయన వ్యవహరిస్తున్న విధానం పనిచేసే వారిని సైతం డైలమాలో పడేస్తున్నట్లు సమాచారం.

వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసులరెడ్డి ఇక్కడ గట్టి అభ్యర్థి. బాలినేనికి ప్రజా నాయకుడిగా మంచి పేరుంది. అందరివాడుగా మంచి గుర్తింపు కూడా వుంది. అయితే ఆయనకు ధీటుగా పోటీ ఇవ్వగలిగే అభ్యర్థిగా



**పార్వతమ్మపై ఆసక్తి శీనయ్యపట్ల అసంతృప్తి**



పార్వతమ్మను అధిష్టానం ఇక్కడ బరిలోకి దింపింది. పార్వతమ్మ నైజం, అందరినీ కలుపు కొనిపోవాలనే తత్వం, సుబ్బరామిరెడ్డి నుండి అబ్బిన దానగుణం, దయామయహృదయం ఆమెకు ప్లస్ పాయింట్లు. కాని ఆమె మరిది పార్లమెంటు సభ్యుడిగానే కాక పార్టీ నాయకుడిగా కూడా ఇక్కడ ఎవ్వరినీ సంతృప్తి పరచలేకపోవడం పార్వతమ్మకు పెద్ద మైనస్‌గా పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఎన్నికలొచ్చినప్పుడు మాటలు చెప్పడం, మూటలు తీయడం తప్ప మిగలిన రోజుల్లో మాటునే వుంటాడన్న అపవాదు శ్రీనివాసులరెడ్డిపైన వుంది. ఎవ్వరికీ ఉపయోగపడని నైజం శీనయ్యదని, సామాన్య కార్యకర్తలకు ఆయన అందుబాటులో వుండడని ఇక్కడ ఆనోటా ఈనోటా వినిపిస్తున్న మాట. తమ కుటుంబానికున్న మంచిపేరు తన భర్త ఒంగోలులో చేసిన గొప్ప కార్యక్రమాలు అజాతశత్రువుగా ఆయన ఆదరించిన స్నేహబాంధవ్యాలు తన విజయానికి దోహదం చేస్తాయని ఓ వైపు పార్వతమ్మ భావిస్తున్నా, అటు బలమైన అభ్యర్థిగా బరిలో వున్న బాలినేని ఓ వైపు, యువరక్తంతో మిస్టర్‌క్లీన్‌గా మొదటిసారి పోటీచేస్తున్న తెలుగుదేశం అభ్యర్థి దామంచర్ల ఆంజనేయులు మనుమడు జనార్ధన్ మరోవైపు వుండడంతో పార్వతమ్మ గెలుపు ఖాయమనే ధీమాతో ఓ వర్గం, ఆమె ఏ స్థానంలో నిలుస్తుందోనన్న సందిగ్ధంతో మరో వర్గం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి ఒంగోలు ప్రజలు ఏం తీర్పు ఇవ్వబోతున్నారో వేచిచూడాల్సిందే!

పడకపై పెద్దాయన •

# వాడుతున్న నేదురు "మల్లి"

నెల్లూరుజిల్లా రాజకీయాలంటే ముందుగా గుర్తువచ్చేది ఆనం కుటుంబం. దివంగత ఏసీ సుబ్బారెడ్డి వారసత్వాన్ని ఆయన వారసులు అంది పుచ్చుకున్నారు. వీరిది రాజకీయ కుటుంబం. అలాగే నల్లపరెడ్డి, సోమిరెడ్డి కుటుంబాలు కూడా. టీచరుగా జీవితం ప్రారంభించి తనదైన పద్ధతిలో కాంగ్రెస్ జాతీయ రాజకీయాల్లోకి చొచ్చుకుపోయిన వ్యక్తి నేదురుమల్లి జనార్ధనరెడ్డి. గూడూరు డివిజన్ రాజకీయాలను తన కనుసన్నలలో ఉంచుకుంటూ, అటు నల్లపరెడ్డి వర్గానికి, ఇటు ఆనం వర్గాన్ని కూడా కాదని తనదంటూ ఒక గ్రూపు ఏర్పాటుచేసుకొని రాజకీయాలు కొనసాగిస్తూ రాష్ట్రాన్ని కూడా ఏలాడు.

ఆనం, నల్లపరెడ్డి కుటుంబాలకు రాష్ట్రస్థాయిలో మంత్రిత్వ బాధ్యతలను నెరపటం వరకే రాజకీయం సాగింది. కానీ నేదురుమల్లి జాతీయ రాజకీయాలలో చక్రం త్రిప్పగలిగిన స్థాయికి ఎదిగాడు, ముఖ్యమంత్రి కాగలిగాడు. కానీ ఇప్పుడు రాజకీయ వారసత్వం లేకుండాపోయింది. భార్య రాజ్యలక్ష్మి రాజకీయాలలోకి వచ్చినా ఒక్కసారి మంత్రి



**తెరమరుగైన వర్గం మూసుకుపోయిన మార్గం**




తర్వాత సాధారణ కాంగ్రెస్ కార్యకర్తగా మిగిలిపోయింది. జనార్ధనరెడ్డిది రాజకీయాలలో ఒంటరిపోరు. ఆయనకు ఆయనే వర్గం. మిగిలిన వారంతా అనుచరులే, కనీసం సహచరులన్నాకాదు. చేదోడువాదోడుగా వుంటుండిన అన్న పద్మనాభరెడ్డికి ఈయనకు మధ్య కొన్ని కుటుంబసమస్యలు తలెత్తటంతో పద్మనాభరెడ్డి గాంధీటోపీ తీసి ట్రంకు పెట్టెలో పెట్టి వైయస్సార్సీ తీర్థం పుచ్చుకున్నాడు.

ఇప్పటికీ నేదురుమల్లి రాజ్యసభ సభ్యుడే, మరో సంవత్సరం పైచిలుకు అలాగే కొనసాగుతాడు. ఆయనకున్న రాజకీయ చతురత ఆయన తర్వాత కుటుంబంలో ఎవరికీరాలేదు. రాజ్యలక్ష్మమ్మ అంతంత మాత్రమే. పెద్దాయన దయాదాక్షిణ్యాలతో ఎదిగిన వారు స్వతంత్రులైపోయారు. మరికొందరు ఆయనను వీడి ప్రస్తుత కాంగ్రెస్‌పార్టీ గజాలతో సాగుతున్నారు. పిలిపించి మాట్లాడేందుకు మామూ ఆరోగ్యం సహకరించటంలేదు. ఈ పరిస్థితుల్లో ఆయనను కలిసి ఇబ్బంది పెట్టడం భావ్యం కాదనేది ప్రస్తుత ఉపఎన్నికల్లో పోటీలో వున్న వారి ఆలోచన. మేము "నేతలు త్రాగాం...." అనే సామెతను గుర్తు తెచ్చుకుంటూ ఆయన కుటుంబం భీష్మించుకొని కూర్చుని వుంది. ఒకప్పటి ఆయన వర్గం అనండి, అనుచరులనండి వారంతా, ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి తిక్కవరపు సుబ్బరామిరెడ్డి వెంట వెళుతున్నారు. ఒక్క మాజీ మంత్రిణి మాత్రమే టి.యస్.ఆర్ ప్రచారాలకు దూరంగా ఉంది. ఆమె

(మిగతా 10వ పేజీలో)

# జగన్ పార్టీలో కొమ్మి, బొమ్మి






## పాతకాపుల మధ్య కొత్తపార్టీలో సరికొత్త పోరు...

ఆత్మకూరు నియోజకవర్గ రాజకీయాలలో కీలకమలుపులు చోటుచేసుకుంటున్నాయి. ఈ నియోజకవర్గానికి చెందిన ప్రధాన నేతలిద్దరు వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధపడ్డారు. అయితే ఇద్దరూ ఒకే లక్ష్యంతో చేరుతుండడంతో ఒకే ఒరలో రెండుకత్తులు ఇమడతాయా? అనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతుంది.

ఆత్మకూరు మాజీఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైపోయింది. తెలుగుదేశంపార్టీలో మారిన పరిస్థితులవల్ల కొమ్మి తెలుగుదేశాన్ని వదిలి బయటకొచ్చేసాడు. ఆయన తన రాజకీయ భవిష్యత్‌ను నిలబెట్టుకోవాలంటే వైయస్సార్ కాంగ్రెస్ తప్ప మరో మార్గంలేదు. కాని వైయస్సార్ కాంగ్రెస్‌లో ప్రధాన నాయకులైన మేకపాటి సోదరులు కొమ్మిని వ్యతిరేకించారు. గతంలో వీరికి, కొమ్మికి పడలేదు. రేపు ఆయనను పార్టీలోకి తీసుకుంటే భవిష్యత్ పరిణామాలు ఎలా వుంటాయో వారికి తెలుసు. అందుకే ఆయన్ను బలంగా అడ్డుకోవాలనుకున్నారు. కాని కొమ్మి మాత్రం భూమా దంపతుల సహకారంతో వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమయ్యాడు. ఈమేరకు జగన్‌తో కూడా సంప్రదింపులు జరిపాడు. జిల్లాలో ఒక చోటయినా కమ్మ సామాజికవర్గం వారికి సీటివ్వాల్సి వుంటుందనే ఉద్దేశ్యంతో జగన్ ఆయనకు పచ్చజెండా ఊపారు. అభ్యర్థిగా ఆయననే ఎంపికచేసే సూచనలు కూడా ఎక్కువగానే వున్నాయి.

అయితే ఇప్పుడు ఇదే నియోజకవర్గానికి చెందిన మాజీఎమ్మెల్సీ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆత్మకూరు రాజకీయాలలో సీనియర్ కుటుంబం బొమ్మిరెడ్డిది. డాక్టర్ సుందర రామిరెడ్డి ఈ నియోజకవర్గ ప్రజలకు ఆత్మబంధువులాంటోడు. తన హస్తవాసితోనే ఆయన మూడు సార్లు ఆత్మకూరు ఎమ్మెల్యేగా పనిచేసాడు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన సుందరరామిరెడ్డి వారసుడే రాఘవేంద్రరెడ్డి. మనిషి మంచి స్పీడు. ఆయన దూకుడు ఏ విధంగా వుంటుందో 2007లో అంతటి వై.యస్.హయాంలో ఎమ్మెల్సీ ఎన్నికలలో ఇండిపెండెంట్‌గా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి మీద గెలిచినప్పుడే జనానికి అర్థమైంది. రాజకీయాల్లోకి వచ్చిన ఐదేళ్లలోనే కాంగ్రెస్ నుండి జంపయ్యి తెలుగుదేశంకు సన్నిహితంగా మెలిగి 2009 ఎన్నికలప్పటికి ప్రజారాజ్యంలో చేరి, తర్వాత గోడకు కొట్టిన బంతిలా కాంగ్రెస్‌లోకే

(మిగతా 10వ పేజీలో)




## యూనిఫాంకు అవమానం

అసలే మన పోలీసువ్యవస్థ తీరు అంతంతమాత్రంగా వుంది. పవన్‌కళ్యాణ్ హీరోగా వచ్చిన 'గబ్బర్‌సింగ్' సినిమాలో పోలీసు ఆఫీసర్‌గా ఆయన నటన వికారంగా వుంది. ముఖ్యంగా పోలీసు యూనిఫాంను కించపరిచేలా ఈ సినిమాలో సన్నివేశాలున్నాయి. పోలీసు వినతీరును శక్తివంతంగా చూపించడం మంచిదే! కాని యూనిఫాంను రకరకాలుగా వేసుకోవడం తగదు.

- వి.నారాయణరావు, రిటైర్డ్ కానిస్టేబుల్.

## వై.యస్. వ్యక్తుడేమైంది

జగన్, రెడ్డి కాదని, జగన్, హిందువుకాదని చాలామంది కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కుల, మతాల పేరుతో చిచ్చుపెట్టి జగన్‌కు ఈ రెండు వర్గాల వారి ఓట్లుపడకుండా చేయాలని చూస్తున్నారు. మరి ఈ నాయకులంతా ఒకప్పుడు వై.యస్.రాజశేఖరరెడ్డి ముందు సాగిలబడినవాళ్లే. అప్పుడు వై.యస్. కులం, వై.యస్. మతం గుర్తుకురాలేదా? మరి హిందువులు జగన్‌కు ఓటేయకూడదను కుంటే ఒక క్రిస్టియన్ మహిళ నాయకత్వంలోనున్న కాంగ్రెస్‌పార్టీకి ఓటెందుకెయ్యాలి.

- జి.ఎస్., నెల్లూరు.

## ఈడూజోడు

ఈడూజోడే ఇంట్లోకిరాదు. జోడులేంది రోడ్లెక్కపోదు. కయ్యము, వియ్యము, నెయ్యము ఈ మూడింటికి సమాన అంతస్తు వుండాలి. అసలు విషయానికొస్తే 'కండ్ల' పనికి మాలిన సీఎం ఇదే చంద్రబాబునోట పలుమార్లు పలుకుమాట! పనికి మాలిన సీఎంతో కుమ్మక్కయ్యే ప్రతిపక్షనేత కూడా పనికిమాలినవాడే. ఊజకలగా అందుకే రెండు దఫాలు అధికారానికి దూరమైంది టీడీపీ. అందుకే తెలుగుదేశం నుండి ఇతర పార్టీలలోకి వలసలు.

- పసుపులేటి లింగనాథం, నెల్లూరు.

## రోడ్లపాలు

జమీల్ ఫ్యామిలీ అని పెట్టింగ్ ఊహించని చాలా మంది రోడ్ల పాలవుతున్నారు. ఇప్పటికైనా జనం బెట్టింగ్ జోలికిపోకుంటే మంచిది.


- జేపీకే, నెల్లూరు.

## 'ప్రభా'తం

ప్రపంచ ప్రజాస్వామ్య వ్యవస్థకు పెద్దదిక్కు భారత పార్లమెంట్ వ్యవస్థ. భారత ప్రజాస్వామ్య పునాదులు నిర్మితమైంది పార్లమెంటు వ్యవస్థ పైనే! ప్రపంచంలో ఏ దేశ పార్లమెంటుకు లేనంత గొప్ప చరిత్ర భారత పార్లమెంట్‌కు వుంది. ఎందుకంటే అత్యంత తక్కువ కాలంలో అత్యంత పెద్ద ప్రజాస్వామ్య దేశంగా, ప్రజాస్వామ్య దేశాలకు ఆదర్శంగా మనగలిగిందంటే ఆ కీర్తి మన పార్లమెంట్‌దే!

భారత పార్లమెంట్ ఉభయసభలు తొలిసారిగా 1952 మే 13వ తేదీన సమావేశమయ్యాయి. అంటే ఈ నెల 13వ తేదీకి 60ఏళ్లు. ఈ చారిత్రాత్మక ఘటన సందర్భంగా పార్లమెంటు ఉభయసభలు 13వ తేదీ ప్రత్యేకంగా సమావేశమయ్యాయి. పార్లమెంట్ స్వర్ణోత్సవ సమావేశంలో తొలి పార్లమెంట్‌సభ్యులు రిషాంగ్ కీషింగ్, రేషమ్‌లాల్ జంగ్డే, కందాళ సుబ్రహ్మణ్యం, కానేటి మోహన్‌రావు వంటి మహానీయులను సత్కరించారు.

అరుపులు, కేకలు, ప్లకార్డుల ప్రదర్శనలు, వాకౌట్లు వంటి సన్నివేశాలు నిత్యకృత్యంగా వుండే పార్లమెంట్ సమావేశం 13వ తేదీ మాత్రం ఎంతో ప్రశాంతంగా, ఎంతో హుందాగా జరిగింది. ఇందుకు... ముందుగా కనీసం ఆ ఒక్కరోజైనా భారత పార్లమెంట్ వ్యవస్థ పరువు కాపాడి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని నీరుగార్చకుండా చేసిన సభ్యులకు కృతజ్ఞతలు తెలపాలి.



### స్వర్ణోత్సవ చిహ్నం

అరువదేళ్ల క్రితం భారత పార్లమెంటు హాల్లో నిబద్ధత, నిజాయితీ కలిగిన మహానీయులు సభ్యులుగా కనిపించారు. ప్రజల సమస్యలమీద ఆరోజు చర్చలు జరిగాయి. కాని ఈరోజు గూండాలు, రౌడీలు, ఆర్థిక నేరస్థులు పార్లమెంటుసభ్యులుగా మారి, చర్చల బదులు రచ్చలు ఎక్కువయ్యాయి.

ఇక భారత రాష్ట్రపతి ప్రతిభా పాటిల్, ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, ప్రధాని మన్మోహన్‌సింగ్, సీనియర్ పార్లమెంటేరియన్ ఎల్.కె.అద్వానీ వంటి నాయకులు సభలో భారత పార్లమెంట్ వ్యవస్థ ఔన్నత్యాన్ని గురించి ఎంతో గొప్పగా చెప్పారు. భారత ప్రజాస్వామ్యం అడ్డదారి పట్టడాన్ని ఏ మాత్రం అనుమతించమని రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ పేర్కొన్నారు. భారత్‌తో పాటే ఎన్నో దేశాలు స్వాతంత్ర్యం పొందితే అందులో కొన్ని దేశాలు నియంతృత్వంలోకి, మరికొన్ని దేశాలు ఏకపార్టీ పాలన క్రిందకు వెళ్లాయని, కాని భారత్‌లో మాత్రం బహుళపార్టీ వ్యవస్థ వుందని, ఇప్పటిదాకా జరిగిన 15సార్వత్రిక ఎన్నికలే భారత ప్రజాస్వామ్య పటిష్టతకు నిదర్శనమని ప్రధాని మన్మోహన్‌సింగ్ సెలవిచ్చారు. పాశ్చాత్య దేశాలు సైతం ఓ నిరుపేద దేశంలో ప్రజాస్వామ్యం ఇంతగా విజయవంతమైందా? అని భారత్‌ను చూసి ఆసూయపడుతున్నాయని అద్వానీ పేర్కొన్నారు.

మన పార్లమెంట్ వ్యవస్థగురించి అందరూ బాగానే చెప్పారు. కాకిపిల్ల కాకికి ముద్దు... అన్నట్లు మనం ఏర్పాటు చేసుకున్నది కాబట్టి పార్లమెంట్ వ్యవస్థ మనకు ముద్దుగానే కనిపిస్తుంది. అయితే మన పార్లమెంట్ వ్యవస్థలో ఎన్ని ఘనవిజయాలున్నాయో, అంతకుమించిన పరాభవాలు కూడా వున్నాయి. ప్రజలకు అవసరమైన చట్టాలకు రూపకల్పన చేయడంలో, సమర్థమైన పరిపాలన అందించడంలో పార్లమెంట్ విఫలం అవుతుంది. కాబట్టే సామాజిక కార్యకర్త అన్నాహజారే లాంటివాళ్లు ప్రత్యామ్నాయ వ్యవస్థను కోరుకుంటున్నారు. ప్రపంచంలో సక్రమంగా పనిచేస్తే ఏ వ్యవస్థయినా మంచిదే! త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడి పాలనను స్వర్ణయుగం అంటారు. ఇప్పటికీ మంచి పరిపాలనకు శ్రీరాముడే ఆదర్శం. మరి అది రాజరికం కాదా? నియంత అయినా అతని పరిపాలన బాగుంటే ప్రజలు ప్రత్యామ్నాయ వ్యవస్థను ఎందుకు కోరుకుంటారు? మన దేశంలో పార్లమెంట్ వ్యవస్థ కూడా అటువంటిదే! సక్రమంగా ఉపయోగించుకుంటే దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు అది పునాది లాంటిదవుతుంది. అడ్డదిడ్డంగా వాడుకుంటే అది పెద్ద గుదిబండ అవుతుంది. పార్లమెంట్ వ్యవస్థ బాగుపడినా, చెడిపోయినా దాని పూర్తి బాధ్యత రాజకీయ పార్టీలదే!

ఒకప్పుడు పార్లమెంటు ఉభయసభలలోనూ నిబద్ధత కలిగిన నాయకులు సభ్యులుగా వుండేవాళ్లు. వాళ్లకు సభ పట్ల గౌరవం వుండేది. ప్రజాస్వామ్య విలువలు తెలిసేవి. సమావేశంలో ప్రతి క్షణాన్ని అమూల్యంగా భావించేవాళ్లు. ప్రజాసమస్యల పట్ల, దేశంలో నెలకొన్న పరిస్థితుల పట్ల అవగాహన వుండేది. అధికార, విపక్షాల మధ్య విమర్శలు సహజమే అయినా, వాటిలో నిజాయితీ వుండేది. నిజాలుండేవి. జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్‌పటేల్, అబుల్‌కలాం ఆజాద్, అంబేద్కర్, గోపాలన్, జగ్జీవన్‌రాం, సుచేత కృపలాని, సర్దార్‌హుకుంసింగ్, కిద్వాయ్, రఫీ అహ్మద్ లాంటి మేధావులుండే సభ ప్రజాస్వామ్యానికి పెట్టనికోటలా హుందాగా కనిపించేది.

కాని ఆ సభను ఈరోజు మనం చూడగలుగుతున్నామా? అనాటి తీపి ఈరోజు మనకు పార్లమెంట్ ఉభయ సభలలో కనిపిస్తుందా? ఈరోజు సమావేశాలను చూడదలుచుకుంటే హర్రర్, క్రైం, సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను చూసినట్లే. ఒకప్పుడు పార్లమెంటులో నెహ్రూ, పటేల్, అంబేద్కర్ లాంటి మహనీయులను చూస్తే, ఈరోజు హంతకులు, రౌడీలను చూడాల్సి వస్తుంది. పార్లమెంట్ పరువు ప్రతిష్టను మంటగలిపే సంఘటనలు మన చరిత్రలో ఎన్నో చోటుచేసుకున్నాయి. సభలో చర్చకంటే రచ్చకే ప్రాధాన్యత పెరిగింది. కేంద్రంలో ప్రభుత్వాలను కాపాడుకోవడానికి సంతలో పశువుల్లాగా పార్లమెంటుసభ్యులను కొనే పరిస్థితులు చోటుచేసుకున్నాయి. 1996లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడడానికి ఎంపీలను కొనుగోలుచేస్తే, 2008లో కేంద్రంలోని యూపీఏ అణుబిల్లును ఆమోదింపజేసే విషయంలో కొందరు పార్లమెంటుసభ్యులు తమకు తాము అధికారపార్టీకి అమ్ముడు పోవడం జరిగింది. ఇక్కడే ఓటుకు నోటు అంటూ సొంత సభ్యులు కొన్ని కట్టలను లోక్‌సభలో ప్రదర్శించడం మనం మరువలేం. పార్లమెంటులో ప్రజాసమస్యల మీద అడగాల్సిన ప్రశ్నలకు సైతం సభ్యులు కరెన్సీ కట్టలు అందుకుని ప్రశ్నలు వేసిన సంఘటన ఎన్డీఏ హయాంలో చోటుచేసుకోవడం మనసుకిసిందే!

మరో ప్రమాదకర పరిణామం ప్రాంతీయతత్వంగల నేతల చేతుల్లోకి పార్లమెంట్ వ్యవస్థ పోతుండడం. జాతీయ ప్రయోజనాల కోసం పనిచేయాల్సిన పార్లమెంట్ పరిధి రానురాను కుచించుకుపోతుంది. ఈ పరిణామాలన్నింటిని అధిగమించి, లోపాలను సవరించుకుంటేగాని భారత పార్లమెంట్ వ్యవస్థ ఉన్నతమైంది కాలేదు. భరతమాతా ఆల్ ది బెస్ట్.

## 'అంతర్'జాతీయం

- ఇస్రో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన క్రయోజనిక్ ఇంజన్ పరీక్ష విజయవంతమైంది. ఈ నెల 12న బెంగుళూరు మహేంద్రగిరిలోని లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ కేంద్రంలో 200సెకన్లపాటు క్రయోజనిక్ పరీక్ష జరిపారు. షార్ నుండి ప్రయోగించే జీఎస్ఎల్‌వి-డి5లో ఈ ఇంజన్‌ను ఉపయోగించనున్నారు.
- ఈ నెల 13వ తేదీన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలోని కిరండోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టులు జరిపిన దాడిలో 7గురు సిఆర్‌పిఎఫ్ జవాన్లు మృతిచెందారు. వారి వద్ద వున్న ఆయుధాలను మావోయిస్టులు ఎత్తుకెళ్లారు.
- పదవీ విరమణ తర్వాత అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరాలని ఆర్మీచీఫ్ జనరల్ వి.కె.సింగ్‌ను అన్నాహజారే ఆహ్వానం పలికారు.
- సూపర్‌స్టార్ అమితాబ్‌బచ్చన్ అన్నదాతల పట్ల తన ఉదారతను చాటుకున్నారు. మహారాష్ట్ర వార్ధా జిల్లాలో 20గ్రామాలకు చెందిన 90మంది రైతులకు 30లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించారు.
- ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన మాతృమూర్తుల జాబితాలో అమెరికా విదేశాంగశాఖ మంత్రి హిల్లరీక్లింటన్ మొదటిస్థానంలో నిలిచారు. భారత్‌లో జన్మించిన ఇంద్రానూయీ 3వ స్థానంలో, యూపీఏ ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ ఆరో స్థానంలో నిలిచారు. ప్రపంచ తల్లుల దినోత్సవం సందర్భంగా 13వ తేదీ ప్రఖ్యాత ఫోర్బ్స్ మేగజైన్ 20మంది శక్తివంతమైన తల్లుల జాబితాను విడుదల చేసింది.
- అల్‌ఖైదా అధినేత అల్ జవహరి తమ దేశంలో లేదని లండన్ పర్యటనలో వున్న పాక్ ప్రధాని యూసఫ్‌రజా గిలానీ పేర్కొన్నారు. అల్ జవహరి పాకిస్థాన్‌లోనే వున్నాడని అమెరికా విదేశాంగశాఖమంత్రి హిల్లరీ చేసిన వ్యాఖ్యలను ఆయన తోసిపుచ్చారు.
- సమాజ్‌వాది పార్టీ అధినేత ములాయంసింగ్ యాదవ్ ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ స్టేట్స్‌మెన్ అవార్డ్-2012కు ఎంపికయ్యారు. ఈ నెల 28న లండన్‌లో బ్రిటన్ సుప్రీంకోర్టు అధ్యక్షుడు లార్డ్ ఫిలిప్స్ చేతుల మీదుగా ఆయన ఆ అవార్డును అందుకోనున్నారు.

## వార్త వ్యాఖ్య

| | | | |
|---|---|---|---|
| వార్త | :- | దళిత ముస్లిం, క్రైస్తవుల రిజర్వేషన్ల కోసం ఉద్యమం. | - బాబా రాందేవ్. |
| వ్యాఖ్య | :- | యోగా గురువు ఉద్యమాల దరువుపై మళ్లుతున్నాడెందుకో? | |
| వార్త | :- | మూడోపార్టీ రాకుండా అడ్డుకుంటున్నారు. | - జగన్. |
| వ్యాఖ్య | :- | మూడేంటి... ముప్పై వచ్చివుంటే! | |
| వార్త | :- | జైలుకు పోయేవాడికి జిందాబాద్‌లెందుకు. | - జగన్‌పై డి.హెచ్. విమర్శ. |
| వ్యాఖ్య | :- | సీబీఐ అంతా మీకు చెప్పి చేస్తున్నట్లు మాట్లాడుతున్నారే! | |
| వార్త | :- | తెదేపాలోనే వుంటా. | - జూనియర్ ఎన్టీఆర్. |
| వ్యాఖ్య | :- | ఉండక ఎక్కడికి పోతారు... పోవాలన్నా కుదరదుగా! | |
| వార్త | :- | శక్తివంతమైన 'అమ్మ' సోనియా. | |
| వ్యాఖ్య | :- | అవును... ఆమె ఒక దేశాన్నే శాసిస్తుంది. | |
| వార్త | :- | బాబు ఎప్పటికీ ప్రతిపక్షనేతే. | - సీఎం కిరణ్. |
| వ్యాఖ్య | :- | ఆయన పేరుతో ఆ పదవి రిజిష్టర్ చేస్తే పోలా? | |
| వార్త | :- | బాబును జనం నమ్మరు. | - బొత్స. |
| వ్యాఖ్య | :- | మిమ్మల్నేదో పెద్ద నమ్ముతున్నట్లు...! | |
| వార్త | :- | న్యాయానికి న్యాయం జరగట్లేదు. | - బీజేపీ నేత వెంకయ్యనాయుడు. |
| వ్యాఖ్య | :- | వాళ్లకు అన్యాయం చేస్తేనేకదా నాయకులకు, అధికారులకు న్యాయం జరిగేది! | |
| వార్త | :- | కాంగ్రెస్ కన్నెర్రజేస్తే జగన్‌కు జైలే. | - డి.హెచ్. |
| వ్యాఖ్య | :- | కన్నెర్రజేస్తే జైలు... కనికరిస్తే పదవులా? | |
| వార్త | :- | త్వరలో పెట్రోమోత. | - లీటర్‌కు రూ. 8 పెరిగే అవకాశం. |
| వ్యాఖ్య | :- | ఉపఎన్నికల ఫలితాల గిఫ్ట్ ఏమో! | |

PDF Compressor Free Version



## నెల్లూరు కబుర్లు

# వివిపిల తాకిడి





ఉపఎన్నికల నేపథ్యంలో నెల్లూరుజిల్లాకు రాజకీయ ప్రముఖుల తాకిడి ఎక్కువైంది. ఈ నెల 15, 16తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి ఆత్మకూరు, నెల్లూరు, వింజమూరులలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాలలో పాల్గొని నెల్లూరు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి టి.సుబ్బరామిరెడ్డి, ఉదయగిరి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి కంభం విజయరామిరెడ్డిలకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ ప్రచారం చేసి వెళ్లారు. త్వరలో మెగాస్టార్ చిరంజీవి కూడా ప్రచారానికి వచ్చే అవకాశాలున్నాయి.

తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఇప్పటికే ఒక దఫా కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాలలో తెలుగుదేశం అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించగా, రెండవ విడత ప్రచారాన్ని ఈ నెల 16 నుండి మొదలుపెట్టాడు.

వైయస్సార్ కాంగ్రెస్ తరఫున జగన్మోహన్‌రెడ్డి ప్రచారానికి రావాల్సివుంది. ఈనెల 28న ఆయన సిబిఐ కోర్టుకు హాజరు కావాల్సివున్నందున అంతకుముందే జిల్లాలో ప్రచారానికొస్తాడా? లేక ఆ తర్వాత వస్తాడా? అనేది ఇంకా ఖరారు కాలేదు.

# మద్యం దొంగలెవరో తేలాలి

- ఎన్.లక్ష్మి

మద్యం మాఫియాను అరికట్టేందుకు ఏసీబీ చేత దాడులు చేయించిన ప్రభుత్వం నివేదికలో పేర్కొన్న మద్యం మాఫియా డాన్‌ల పేర్లు బయటపెట్టకపోవడం శోచనీయమని రాష్ట్ర మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎన్.లక్ష్మి పేర్కొన్నారు. 14వ తేదీ మద్యంమాఫియాపై ఏసీబీ నివేదికను బయట పెట్టాలని కోరుతూ నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం మహమ్మారి వల్ల రాష్ట్రంలో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. గుడి, బడి అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ వైన్‌షాపులు, బెల్టుషాపులు, బార్లు పెట్టారని, ప్రతి వీధిలో మద్యం ఏరులై పారుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వం ఎక్సైజ్ ఆదాయంపైనే ఆధారపడి నడుస్తుండడం దారుణమన్నారు. బినామీల పేరుతో నడుస్తున్న మద్యం దుకాణాల లైసెన్సులను రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేసారు.

ఈ ధర్నాలో రాష్ట్ర మహిళాసమాఖ్య అధ్యక్షురాలు పి.దుర్గాభవాని, షేక్ మునీర్, పి.లీలామోహన్, కె.వినోద్, ఎం.విజయ, ఎన్.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## స్వామీజీల వల్లే...

# హిందూత్వం దెబ్బతింటోంది

స్వామీజీల ప్రవచన, వ్యాఖ్యల వల్లే హిందూత్వం దెబ్బతింటోందని అంతర్జాతీయ విశ్వహిందూపరిషత్ అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి ఈనెల12న నెల్లూరులో విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ప్రతి హిందువు గుండెలో హిందూత్వానికి గుడి కట్టాలని అన్నారు. ధార్మిక సంస్థలు, స్వామీజీలు మతమార్పిడులు జరగకుండా చూడాలని అన్నారు. 2014గోకులాష్టమి నుంచి 2015 గోకులాష్టమి వరకు షష్టిపూర్తి ఉత్సవాలను విశ్వహిందూపరిషత్ దేశవ్యాప్తంగా జరుపుకోనుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 5 లక్షలు, పూర్వాంధ్రలో 2 లక్షలు, నెల్లూరుజిల్లాలో ఐదవేల సభ్యత్వం నమోదు చేయనున్నట్లు తెలిపారు. విశ్వహిందూపరిషత్ హిందువుల్లో ధార్మిక నిష్ఠను పెంచేందుకు కార్యక్రమాలు రూపొందించి నిర్వహిస్తోందని అన్నారు. ఈ సమావేశంలో వి.హెచ్.పి ప్రాంతీయ అధ్యక్షుడు కట్ట హరనాథ్‌రెడ్డి, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, కార్యదర్శి వాసు, సంఘటనా [illegible] శ్రీనివాసులు [illegible] గుండాల ఆంజనేయులు, మెంటా రామ్మోహన్‌రావు మొదలగువారు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఎంసెట్



ఎంసెట్-2012ను ఎట్టకేలకు అధికారులు నెల్లూరులో ప్రశాంతంగా నిర్వహించారు. నెల్లూరులోని 22 పరీక్షా కేంద్రాల్లో ఈనెల 12న ఉదయం ఇంజనీరింగ్, మధ్యాహ్నం మెడిసిన్ ప్రవేశపరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు హాజరుకావడానికి విద్యార్థులు అధికారుల నిబంధనలను పాటించడంలో కొంత ఇబ్బందిపడ్డారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసిన ఫారం, హాల్‌టిక్కెట్ రెండూ పరీక్షాహాలులోకి తీసుకురావాలని అందులో రిజిస్ట్రేషన్‌ఫారంపై గెజిటెడ్ అధికారి అటెస్టేషన్ చేయించాలని అధికారులు నిబంధనపెట్టారు. కాని కొందరు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సమాచార లోపం వల్ల హాల్‌టిక్కెట్ మాత్రమే తీసుకురావడంతో, పరీక్షాకేంద్రం వద్ద వారు ఆందోళనకు గురై ఇంటి దగ్గర నుంచి అప్పటికప్పుడు వాటిని తెప్పించుకున్నారు.

ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షాకేంద్రంలోకి అనుమతించరని తెలిసినా కొంతమంది ముందు జాగ్రత్త లేకపోవడంతో ఉరుకులు, పరుగులు పెట్టడం అక్కడక్కడ కనిపించింది. మొత్తంమీద పోలీసు బందోబస్తుతో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, మెడిసిన్ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

# 'దేశం' రథసారథులు

తెలుగుదేశంపార్టీ తరఫున నెల్లూరు లోక్‌సభ, ఉదయగిరి అసెంబ్లీలకు సమన్వయకర్తలను ప్రకటించారు. కావలికి బీద మస్తాన్‌రావు, నెల్లూరు రూరల్, కోవూరులకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు నగరానికి బీద రవిచంద్ర, ఒబ్లి దుర్గాప్రసాద్, ఆత్మకూరుకు కురుగొండ్ల రామకృష్ణ, బీద రవిచంద్ర, ఉదయగిరికి దేవినేని ఉమామహేశ్వరరావు, పరసా రత్నం, బీద రవిచంద్రలను నియమించారు. నెల్లూరు పార్లమెంటు పరిశీలకులుగా తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఉదయగిరి అసెంబ్లీకి పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా గుంటుపల్లి నాగేశ్వరరావులను నియమించారు.


# కవికోకిల 116వ జయంతి

దువ్వూరు రామిరెడ్డి విజ్ఞానసమితి ఆధ్వర్యంలో 'కవికోకిల' దువ్వూరు రామిరెడ్డి 116వ జయంతి సభ ఈ నెల 19వ తేదీ 6.30గంటలకు నెల్లూరు పురమందిరం నందు జరుగుతుందని సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి.వి.రమణారెడ్డి, వి.వి. నరసింహాంలు ఒక ప్రకటనలో తెలిపారు. పి.వి.రమణా రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సభలో పద్యకళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.ఆర్.ప్రసాద్ కవికోకిల కవితావైభవంపై ఉపన్యసించి విజ్ఞానసమితి వారు అందించే సన్మానాన్ని స్వీకరిస్తారు. సభకు ముందు శ్రీమతి జె.బాలార్క శిష్యబృందంచే భక్తి కచేరి జరుగుతుంది.

# బైక్‌దొంగల కోసం స్పెషల్ పోలీస్

నెల్లూరులో ఈ మధ్య చైన్ స్నాచింగ్, బైక్ దొంగతనాలు విరివిగా జరుగుతుండడం తెలిసిందే. వాటిని నివారించేందుకు సీసీఎస్ సిఐ వీరాంజనేయరెడ్డి నగరంలోని ఆరు పోలీస్‌స్టేషన్లలో ఒక్కొక్క స్టేషన్‌కు నలుగురు కానిస్టేబుళ్ల చొప్పున నియమించడం హర్షదాయకం. అంతేకాకుండా స్టేషన్ పరిధిలో జరిగే ఈ దొంగతనాలకు వారే బాధ్యత వహించాలని పోలీస్ కానిస్టేబుల్స్‌ను హెచ్చరించారు. నగరంలోని ముఖ్య కూడళ్లలో పోలీసుల నిఘా వుండడంతోనైనా ఈ చైన్‌స్నాచింగ్‌లు, బైకు దొంగతనాలు ఆగుతాయేమో చూడాలి. బ్యాంకులు, షాపింగ్‌మాల్‌లు, బస్టాండ్ల వద్ద కూడా ఈ నిఘా అవసరమని పోలీసు ఉన్నతాధికారులు గుర్తించి ఆదేశించినట్లు తెలిసింది. పోలీసుకానిస్టేబుల్స్ బాధ్యతవహిస్తే ఈ దొంగతనాలు తప్పక తగ్గుతాయి.

# పూజతో ప్రచారం మొదలెట్టిన ముంగమూరు



నెల్లూరు నగరఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి 14వ తేదీ నుండి పాదయాత్ర ద్వారా లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి టి.సుబ్బరామిరెడ్డికి మద్దతుగా ప్రచారం మొదలుపెట్టారు. దీనికి ముందు ఆయన నవాబుపేటలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సుబ్బరామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. అనంతరం కుసుమహరిజనవాడ, రామచంద్రారెడ్డినగర్, పుల్లయ్యసత్రం ప్రాంతాలలో పాదయాత్ర చేస్తూ హస్తం గుర్తుకు ఓట్లేసి సుబ్బరామిరెడ్డిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రంగయ్యనాయుడు, కిన్నెర ప్రసాద్, కొణిదెల సుధీర్, సాయిలలిత, వసీం తదితరులు పాల్గొన్నారు.

# నగర 'దేశం'కు కోటంరెడ్డి



తెలుగుదేశంపార్టీ నెల్లూరు నగర కమిటీ అధ్యక్షులుగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని నియమించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా నూనె మల్లికార్జునయాదవ్, బి.సి. అధ్యక్షుడిగా అన్నం దయాకర్ గౌడ్, జిల్లాపార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా వై.వి. సుబ్బారావులను నియమించారు. ఇంతకాలం నగర పార్టీ అధ్యక్షుడుగా వున్న కిలారి వెంకటస్వామినాయుడును నెల్లూరు గ్రామీణపార్టీ కమిటీ కన్వీనర్‌గా నియమించారు.

# శాస్త్రోక్తంగా శ్రీనివాసుని కల్యాణం



ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజె) ఆధ్వర్యంలో నెల్లూరు దర్గామిట్టలోని తితిదే కల్యాణ మండపంలో ఈనెల 12న శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు తనూజ విష్ణువర్ధన్‌స్వామి, గోవింద గిరిధర్‌స్వామి, మేడు నరసింహకుమార్‌స్వామి, చైతన్యస్వామి, రాఘవయ్యస్వాములు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి తొలుత అభిషేకం, తదుపరి కల్యాణం వేదమంత్రోచ్ఛారణల నడుమ భక్తిరంజకంగా నిర్వహించారు. ఈ కల్యాణంలో జిల్లాకలెక్టర్ బి.శ్రీధర్, ఎస్పీ రమణకుమార్, నెల్లూరు నగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, వీహెచ్‌పి అంతర్జాతీయ అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు హరనాథ్, జాతీయ కార్యదర్శి కోటీశ్వరశర్మ, తితిదే ధార్మిక సలహామండలి సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి మొదలగువారు పాల్గొన్నారు. సంగీత విద్వాంసురాలు జె.బాలార్క శిష్యబృందం ఆలపించిన అన్నమాచార్యకీర్తనలు వీనులవిందు చేయగా, కళాదీప్తి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యాధరి, కృష్ణప్రియ, అభినయ, ఆర్తి మొదలగు చిన్నారులు చేసిన భరతనాట్యాలు, నృత్యాలు అందర్నీ అలరించాయి.

చాలా సంతోషం. ఇన్నాళ్లకి జర్నలిస్టులకి ఓ మంచి బుద్ధి కలిగింది. ఆ శ్రీనివాసుడు వీరిచేత ఇంకా మంచి కార్యక్రమాలను చేయించాలని "లాయర్" ఆకాంక్ష.

# ప్రజాసమస్యలను గాలికొదిలేసారు

ఎల్లసిరి గోపాల్‌రెడ్డి

ప్రజా సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారని వైఎస్ఆర్ సిపి కేంద్రకమిటీ సమన్వయకమిటీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి అన్నారు. 14న నెల్లూరులోని మేకపాటి అతిథిగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవులకోసం పాకులాడుతూ ప్రజలను ఇబ్బందులుపెడుతున్న కాంగ్రెస్ నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. నెల్లూరులో ఆనం సోదరులు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా మేకపాటి సోదరులను విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నారని అన్నారు. రాజకీయాలలోకి రాకముందే వ్యాపారరంగంలో ఎంతో ఎత్తుకి ఎదిగిన మేకపాటి సోదరులకు ధనాశలేదని పేర్కొన్నారు. అలాగే మాజీ డిజిపి ఆంజనేయరెడ్డి కూడా వారికి వంతపాడుతూ వైఎస్సార్ సి.పిని విమర్శించడం విడ్డూరంగా వుందన్నారు. ఉపఎన్నికలు తమ పార్టీ నేతల వల్లనే వచ్చాయంటూ ప్రచారం చేస్తున్నారని, దివంగతనేత వైఎస్ఆర్‌పై అభిమానమే తమ నేతలను రాజీనామాలు చేయించి ప్రజలగుండెల్లో వారి స్థానాన్ని పదిలంచేసిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్‌సిపి నగర కన్వీనర్ ఆనం వెంకటరమణారెడ్డి, నాయకుడు స్పందన ప్రసాద్ మొదలగువారు పాల్గొన్నారు.

# మా మద్దతు మీకే

## టి.యస్.ఆర్.ను కలిసిన పెన్షనర్ల సంఘం



సుబ్బరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు

వరాలిచ్చే గుణం, అడిగింది కాదనకుండా చేసే లక్షణం కలిగిన తిక్కవరపు సుబ్బరామిరెడ్డి గెలుపుకి పెన్షనర్ల అసోసియేషన్ నెల్లూరుజిల్లా శాఖ కృషి చేస్తుందని ఆ శాఖ జిల్లా ఉపాధ్యక్షుడు పొత్తూరి మోహన్‌రావు తెలిపారు. రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడిగా సైతం వున్న ఆయన శనివారం నాడు తమ సంస్థ సభ్యులతో కలసి సుబ్బరామిరెడ్డిని ఆయన నివాసంలో కలిసి తమ మద్దతు ప్రకటించారు. తమ అసోసియేషన్ నిర్మిస్తున్న భవనానికి సహాయం చేయవలసిందిగా మార్చి నెలలో తాము ఆయనను కలిసినప్పుడు అడిగిన వెంటనే యం.పి. నిధుల నుండి 20లక్షల రూపాయలు మంజూరుచేసిన దాతగా ఆయన సుబ్బరామిరెడ్డిని కొనియాడారు. తాము కలిసేనాటికి ఆయన నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిత్వం సైతం ప్రచారంలో లేదని అన్నారు.

మోహన్‌రావుతో పాటు, జిల్లా అధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రమణయ్య, జాయింట్ సెక్రటరీ రామచంద్రయ్య, ఉపాధ్యక్షులు రామిరెడ్డి, కొండాచారి, చలం, అసోసియేట్ అధ్యక్షులు సుబ్బారాయుడు, సభ్యులు ప్రకాష్‌రావు, సుబ్రహ్మణ్యం, యానాదయ్య, సీతారామరాజు, సుబ్బరత్నమ్మ, నాగరత్నమ్మ తదితరులు టీ.యస్.ఆర్‌ని కలిసిన వారిలో వున్నారు.

# వారిది అధికారం... మాది మమకారం!

కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీలు ధన బలంతో ప్రజలను ప్రలోభపెట్టాలని చూస్తున్నాయని, కాని జగన్‌కు అండగా వున్న జనబలంతోనే తాము గెలుస్తామని నెల్లూరు పార్లమెంట్ వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన తన తమ్ముడు ఉదయగిరి వైయస్సార్‌కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి కొండాపురం మండలంలోని కొండాపురం, ముండివారిపాలెం, శెట్టిపాలెం, మిట్టపాలెం, ఆదిమూర్తిపురం, తూర్పుబ్రాహ్మణపల్లి, చింతలదేవి, కొత్తఉప్పలూరు, పాత ఉప్పలూరు, గొట్టిగుండాల గ్రామాలలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత మహానేత వై.యస్.రాజశేఖరరెడ్డి చేసిన మేలును ఆయన ద్వారా పదవులు పొందిన కాంగ్రెస్ నాయకులు మరచిపోయినా, ప్రజలు మరచిపోలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు తమ ఇళ్లల్లో నుండి వై.యస్. ఫోటోలు తీసేయగలరేమోగాని ప్రజల గుండెల్లో ముద్రపడి వున్న ఆయన రూపాన్ని తొలగించలేరన్నారు. నెల్లూరులో పుట్టి నెల్లూరును ఎప్పుడో మరచిపోయిన నాయకులు ఇప్పుడు నా జన్మభూమి అంటూ నెల్లూరులో దిగబడ్డారని, ఇలాంటి రాజకీయ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. కోవూరు ఉపఎన్నికలలో

## కొండాపురంలో మేకపాటి విస్తృత ప్రచారం



కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు విపరీతంగా ధనం, మద్యాన్ని పారించాయని, అయినా ప్రజలు వైయస్సార్ కాంగ్రెస్‌కే పట్టం కట్టారన్నారు. ఈ ఉపఎన్నికలలోనూ అవే ఫలితాలు రాబోతున్నాయని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం వై.యస్. ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నింటిని ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు.

ఉదయగిరి వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ జనప్రభంజనం ధాటికి కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు నిలవలేక మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడుతున్నాయన్నారు. ఈ రాష్ట్రానికి 9ఏళ్లు సీఎంగావున్న చంద్రబాబునాయుడు చేసిందేమీలేదు... ఇప్పుడు అధికారమిస్తే ఇరగదీస్తానని గాలి కబుర్లు చెబుతున్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి సోనియా చేతిలో కీలుబొమ్మలాంటోడు. ఇలాంటి నాయకులే మనకు అక్కరలేదని, జగన్ లాంటి దమ్మున్న నాయకుడు కావాలన్నారు.

ఈ ప్రచార కార్యక్రమంలో వారివెంట వైయస్సార్సీపి నాయకులు కందుల అనిత, కర్తం శ్రీనివాసులురెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, ఆర్.అంకయ్యనాయుడు, యడ్లపల్లి వెంకటరమణయ్య, రవీంద్రనాయుడు, సి.హెచ్.ప్రసాద్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావం కలది తెలుగుదేశం పార్టీ

**వంటేరు**



ఏకనాయకత్వం, క్రమశిక్షణ, ఒకరితో ఒకరు సమన్వయం, పకడ్బందీ వ్యూహరచన, అంకితభావంతో పనిచేయటం తెలుగుదేశం పార్టీ లక్షణాలన్నారు నెల్లూరు పార్లమెంటు టిడిపి అభ్యర్థి వంటేరు వేణుగోపాలరెడ్డి. ఎన్నికల ప్రచారపర్వంలో భాగంగా జలదంకి మండలం అన్నవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం నెల్లూరు పార్లమెంటు బరిలో దిగానన్నాడు. పార్లమెంటు అభ్యర్థిత్వంపై వెనక్కుతగ్గానని, పార్టీ సమావేశాలకు హాజరుకాలేదని ఊహాగానాలు వచ్చాయన్నారు. ఇది కేవలం ఊహాజనితమైనదే తప్ప వాస్తవం కాదని ఆయన ప్రకటించారు. కొత్తగా ఏర్పడిన వైయస్సార్సీలో అప్పుడే వర్గాలు మొదలై పార్టీలో లుకలుకలు ప్రారంభమైనాయన్నారు. కాంగ్రెస్‌పార్టీ విషయానికి వస్తే మాట్లాడాల్సిందేమీ లేదన్నారు. ఉపఎన్నికల్లో ఖచ్చితంగా కాంగ్రెస్‌పార్టీది మూడోస్థానమేనని ఆయన జోస్యంచెప్పారు. సమావేశంలో కావలి ఎమ్మెల్యే బీదమస్తాన్‌రావు, వెంకటగిరి శాసనసభ్యుడు కురుగొండ్ల రామకృష్ణ, పార్టీ పరిశీలకులు వసంత సత్యనారాయణ తదితరులు కూడా పాల్గొన్నారు.

# బలహీనవర్గాల బలం కాంగ్రెస్సే!

బలహీనవర్గాలకు మొదటనుండి కొండంత అండగా నిలిచింది కాంగ్రెస్‌పార్టీయేనని బలహీనవర్గాల నేతలు అభిప్రాయపడ్డారు. సోమవారం నెల్లూరులోని హోటల్ భవాని రెసిడెన్సీ కాన్ఫరెన్స్ హాల్‌లో బి.సి.వర్గాల నేతల ఆత్మీయసమావేశం జరిగింది. ఈ సమావేశంలో నెల్లూరు పార్లమెంట్‌కు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న టి.సుబ్బరామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని బలహీనవర్గాల బలాన్ని చాటాలని నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ మాజీఛైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ మాట్లాడుతూ బలహీనవర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీయే దోహదపడిందన్నారు. సీటిచ్చిన కాంగ్రెస్‌పార్టీని, ఓట్లేసిన ప్రజలను మోసంచేసిన మేకపాటి సోదరులను ఈ ఎన్నికలలో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. పిసిసి కార్యదర్శి సి.హెచ్. హరిబాబుయాదవ్ మాట్లాడుతూ బిసిలంతా ఏకతాటిపై నడిచి సుబ్బరామిరెడ్డి విజయానికి కృషి చేయాలన్నారు. బలహీనవర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. నెల్లూరు పార్లమెంట్‌కు ఎంతో సమర్థవంతుడు,



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న చెంచలబాబుయాదవ్

నిజాయితీపరుడైన సుబ్బరామిరెడ్డి పోటీచేస్తున్నారని, ఆయనను గెలిపించుకోవడం మన బాధ్యతన్నారు.

ఈ సమావేశంలో బి.సి. సంఘాల నేతలు ఉదయగిరి నరసింహులు గౌడ్, కిన్నెర మాలకొండయ్య, గంగపట్నం చంద్రశేఖర్, వింజమూరు మస్తాన్‌బాబు, బెల్లంకొండ చిన్నయ్య, నరసయ్య, చంద్రశేఖరయ్య, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు కాలం దగ్గరపడింది

రాష్ట్రంలో జనం సమస్యలను గాలికొదిలి జనపథ్10 సేవకే ప్రాధాన్యతనిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీకి రోజులు దగ్గరపడ్డాయని వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. నెల్లూరు పార్లమెంట్ వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డికి మద్దతుగా ఆయన సోమవారం నెల్లూరులోని పద్మావతి సెంటర్, లేక్‌వ్యూకాలనీ, ప్రగతినగర్ ప్రాంతాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన ప్రతి ఒక్కరినీ అభ్యర్థించారు. మహానేత వై.యస్. రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నీరుగార్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు రాష్ట్ర ప్రజలంతా ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారని ఈ సందర్భంగా కోటంరెడ్డి అన్నారు. వై.యస్. ఆశయాలు నెరవేరాలంటే జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. జగన్ జన బలాన్ని ఎదుర్కోలేక కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనపై అక్రమకేసులు బనాయిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ అణచాలనుకునే కొద్దీ జగన్ అసమానశక్తిగా



నెల్లూరు వీధుల్లో ప్రచారం నిర్వహిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ఎదుగుతాడన్నారు. జగన్‌ను సీఎంగా చూడాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారని, నెల్లూరు పార్లమెంట్‌లో అఖండ విజయంతోనే ఆ దిశగా తొలిఅడుగు పడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు కె.వి.రాఘవరెడ్డి, ప్రశాంత్, కిరణ్, శరత్, యూసఫ్, అజీమ్, హసీనా, అనుపమ, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలుమావే...

**చంద్ర రాజగోపాల్**



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయటం రాష్ట్ర ప్రభుత్వ ఘనతేమీ కాదన్నారు. నెల్లూరు పార్లమెంటు సిపియం అభ్యర్థి చంద్ర రాజగోపాల్. అనంతసాగరం మండలంలో పలుగ్రామాలలో విస్తృత ప్రచారాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యంకు కనీస గిట్టుబాటు ధరలేక విలవిలలాడుతున్న రైతన్నల కోసం నిరంతర పోరాటం జరిపింది. సిపియం పార్టీయేనన్నారు. పార్టీ ఆధ్వర్యంలో భారీఎత్తున జరిగిన ఉద్యమానికి స్పందించి రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. జరుగనున్న ఉపఎన్నికల్లో భారీస్థాయిలో మద్యం, డబ్బు పంపిణీకి కాంగ్రెస్, తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలు సంసిద్ధంగా వున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజలు పార్టీల పనితీరును గమనిస్తున్నారని సరైన నిర్ణయాన్నే తీసుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశాడు.

అనంతసాగరం మండల ప్రచారంలో చంద్రతో పాటుగా సిపియం ఆత్మకూరు డివిజన్ కార్యదర్శి లక్ష్మీపతి, నాగయ్య, మస్తాన్, ఇంకా పుల్లయ్య, ఫకీర్‌సా, అన్వర్, సిపియం మండల గ్రామస్థాయి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి ఏడు గంటల విద్యుత్

-ట్రాన్స్‌కో యస్.ఇ.కె.నందకుమార్

వ్యవసాయదారులకు ఖరీఫ్ సీజన్‌లో 7గంటల పాటు విద్యుత్ సరఫరా కలుగజేస్తా మన్నారు ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీరు కె.నందకుమార్. సైదాపురం మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను 14వ తేదీ ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. అక్కడ నుండి అనంతపురం, ఊటుకూరు, తలుపూరు తదితర సబ్‌స్టేషన్లను కూడా ఆయన పరిశీలించి రికార్డులను చెకిచేశారు. ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో వుండాలని ఆయన ఆదేశాలు జారీచేశారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారులు విద్యుత్ సిబ్బందితో సహకరించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏడిఇ రాఘవేంద్ర, ఏఇ చిన్నస్వామినాయక్ ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

# మమ్మల్ని ఉద్ధరించండి

## కృష్ణపట్నం ప్రజల వేడుకోలు

కృష్ణపట్నంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని పోర్ట్, పామాయిల్, థర్మల్ ప్రాజెక్ట్‌ల వల్ల ఎటువంటి కాలుష్యం ఏర్పడకుండా తగిన చర్యలు చేపట్టామని అధికారులు ఇచ్చిన హామీలు, మాటలకే పరిమితమైపోయాయి. అధికార యంత్రాంగం, ప్రాజెక్ట్‌ల ప్రతినిధులు మమ్మల్ని మోసం చేశారంటున్నారు ప్రజలు. కృష్ణపట్నం కాలుష్యకోరల్లో చిక్కుకొనిపోయింది. దుర్భర జీవితాన్ని గడుపుతున్నాం. గత నాలుగు సంవత్సరాలుగా మా పరిస్థితి ఇలాగే వుంది. కనీసం పునరావాస సౌకర్యాన్నైనా కల్పించండి. ఒక ప్రక్క భూములు కోల్పోయాం, మరో ప్రక్క ఉపాధి, హామీకే పరిమితమైపోయింది. మా బ్రతుకులిట్లా రోడ్డునపడ్డాయి. మమ్మల్ని రాజకీయనాయకులు, స్థానిక అధికారులు, స్థానిక ప్రాజెక్ట్‌ల ప్రతినిధులు పట్టించుకోవటం మానేశారు. జిల్లా కలెక్టర్‌వారైనా మాపై కనికరించి అవసరమైన చర్యలు చేపట్టండి.

## అక్రమ మోటార్లను తొలగిస్తా

### ఎం.పి.డి.ఓ రమణయ్య

నాకాడు మండలం కొడివాక మహిళలు 14వ తేదీ మండలాభివృద్ధి అధికారి రమణయ్యను ఖాళీ బిందెలతో కార్యాలయంలో కలిశారు. గ్రామంలోని దళితవాడకు మంచినీరు అందటంలేదని ఫిర్యాదు చేశారు. అందుకు కారణం కొంతమంది గ్రామస్తులు కొళాయిలకు మోటార్లు బిగించటం వల్ల ఎగువ ప్రాంతంలో వున్న మా వాడ కొళాయిలల్లో నీరురావటంలేదని విజ్ఞప్తిచేశారు. దిగువనున్న గ్రామస్తుల కొళాయిలకు ఏర్పాటుచేసిన మోటార్లు తొలగిస్తే దళితవాడకు మంచినీరు అందుతాయన్నారు. మహిళల విజ్ఞప్తికి స్పందించిన ఎం.పి.డి.ఓ వర్షం తీసుకొని కొడివాక గ్రామంలో ఏర్పాటుచేసి వున్న అక్రమ మోటార్లను తొలగిస్తామని హామీ ఇచ్చారు. హామీతో సరిపెట్టకోకుండా తగుచర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

## నన్ను అసెంబ్లీకి పంపండి

### టి.ఎస్.మాల్యాద్రినాయుడు

ఉదయగిరి శాసనసభా స్థానానికి పోటీ చేస్తున్న వికలాంగుల సేవాసంస్థ అధ్యక్షుడు టి.ఎస్.మాల్యాద్రినాయుడు ప్రచారం ప్రారంభించారు. ఒక వికలాంగుడిగా ప్రజల కష్టాలు తెలిసిన వాడినన్నారు. మీ అమూల్యమైన ఓటును ఎవరికో వేసి శాసనసభకు పంపారని, అదే అమూల్యమైన ఓటు తనకు వేసి, తనను శాసనసభకు పంపాల్సిందిగా ఆయన నియోజకవర్గ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వికలాంగ, పేద, బడుగు, బలహీనవర్గాల వారి సంక్షేమం పట్టించుకొనే నేతలు కరువైనారని ఆయన విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, వికలాంగులు తమతమ ప్రాంతాల్లో ప్రచారంచేసి ఓటర్లను ప్రభావితం చేయాలని ఆయన కోరారు. ప్రచారంలో ఆయన వెంట గర్రె బ్రమీల, సత్య పుల్లయ్య, శ్రీనివాసులు, వెంకటయ్య వికలాంగ సేవాసంస్థ బాధ్యులు పాల్గొన్నారు.

# డంపింగ్‌యార్డ్ ఏర్పాటుచేయండి

కృష్ణపట్నం పామాయిల్ ఫ్యాక్టరీ వ్యర్థాలు రోడ్లు ప్రక్కన తోలటంతో దుర్వాసన భరించలేకపోతున్నామని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పామాయిల్ తయారీకి వినియోగిస్తున్న పరిసొట్టు ద్వారా వచ్చే ఊక గ్రామాలను కప్పేస్తుంది. నిడుగుంటపాళెం, మొలకలపూడి, పుంజులూరుపాడు, గుడికాడపొర్లు, పంటపాళెం తదితర గ్రామాలలోని ఇళ్లపైనే కాకుండా, పంటపొలాలపై సైతం ఈ ఊక కమ్మేస్తుంది. ఎన్నిమార్లు ఫ్యాక్టరీ యాజమాన్యానికి, సంబంధిత అధికారులకు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవటంలేదు. సంబంధిత జిల్లా అధికారులైనా స్పందించి ఫ్యాక్టరీ నుండి ఊక గాలిలోకి రాకుండా పొల్యూషన్ కంట్రోల్ యంత్రాలను ఏర్పాటుచేసేందుకు ఆదేశాలు జారీ చేయాలని ప్రజల విన్నపం. అలాగే ఫ్యాక్టరీ వ్యర్థపదార్థాలకోసం గ్రామాలకు దూరంగా ఒక డంపింగ్ యార్డ్‌ను కూడా ఏర్పాటు చేయాల్సిందిగా ఆయా గ్రామాల వాసులు కోరుతున్నారు.

# ఈ ఊరికి కరెంటులేదు

గ్రామాలకు విద్యుత్ వచ్చిందని సంతోషపడటం మామూలే. అయితే సంతోషపడ్డంత సమయమున్నా విద్యుత్ సరఫరా లేకపోతే ఏమిచేయాలి. అసలు ఒక నెలరోజులపాటు గ్రామం చీకటిలో వుండిపోతే స్పందించని ట్రాన్స్‌కో అధికారులను ఏమనాలి. ఏమన్నా అనవపోయినా ఉదయగిరి మండలంలోని నన్నూంవారి చింతలపాళెంలో నెలరోజులుగా కరెంటు సప్లయ్‌లేదు. ఇదేవిజం. 14వ తేదీ ఉపఎన్నికల ప్రచారానికై కొన్ని పార్టీల నేతలు ఆ గ్రామానికి చేరుకున్నారు. అక్కడ ఓట్లు తమకే వేయాలని అభ్యర్థించుకున్నారు. అయితే ఆ గ్రామ మహిళలు మాత్రం వెళ్లిన పార్టీల వారికింత గడ్డిపెట్టారు. నెలరోజులుగా మా గ్రామం చీకటిలో వుంటే పట్టించుకున్న నాధుడులేడు. ఇప్పుడు ఓట్లకు మాత్రం మా ఊరికొస్తే దండెత్తివచ్చారని ఆక్రోశాన్ని వెలిబుచ్చారు.

# కొళాయిలు కట్టేస్తున్నారు

కావలి పట్టణ పరిధిలోని పేదవాడలలో వీధికొళాయిలను తొలగించాలని మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయం తీసుకొంది. అందుకు మారుగా ఆయా ప్రాంతాలలో నివసించేవారు 200రూపాయలు డిపాజిట్ చెల్లించి వారింటి ఆవరణలోనే కొళాయిలను ఏర్పాటుచేసుకొని వాటర్ టాక్స్ చెల్లించాలని తెలిపింది. పట్టణంలోని వెంగళరావునగర్, తుఫాన్‌నగర్, ఇందిరానగర్, అరుంధతీయవాడ, అంబేద్కర్‌నగర్, మోడల్‌కాలనీ, జొన్నాయుగుంట, పెండలఫ్యాక్టరీ, వైకుంఠపురం తదితర ప్రాంతాలలో నివసించే వారంతా దారిద్ర్యరేఖకు దిగువన వుండేవారే. వారంతా నిత్యం కూలిపనులు పాచి పనులు, బేల్దారి పనులు, బండ్లపై చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొనేవారే. వీరి మంచినీటికి వీధి కొళాయిలే ఆధారం. అయితే కావలి పురపాలక సంఘం తన రెవెన్యూని పెంచుకొనేందుకు మార్గాన్వేషణలలో భాగం ఫ్లష్ ఏరియాలలో వీధికొళాయిలను తొలగించటం. ఇప్పటికీ రోజు జరగక పనులు లేక నానా ఇక్కట్లుపడుతున్న పేద వారి నోటి దగ్గర మంచినీరు తొలగించటంతో పాటు వారిని స్వంత కొళాయిలు ఏర్పాటుచేసుకోమనటం దారుణమని పాలకవర్గంలో ఒక వర్గం అభ్యంతరాలు తెలుపుతుంది. కావలి పట్టణంలో అధికారిక కొళాయిలు ఎన్ని వున్నాయో ఇంచుమించుగా అన్ని అనధికారిక కొళాయిలు కూడా వున్నాయని కొందరు బాహాటంగా విమర్శిస్తున్నారు. అనధికారిక కొళాయిలను క్రమబద్ధీకరించలేక వీధికొళాయిలు తీసివేయటం సబబు కాదంటున్నారు. పేద ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సింది పోనిచ్చి వారి వాడలలో వుండే కొళాయిలను తీసివేయటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కావలి పురపాలక సంఘం ఈ ప్రయత్నం మానుకోకపోతే అందుకు తగ్గట్టుగా కమీషనర్ కార్యాలయం వద్ద ఆందోళనా చేపట్టామని కొన్ని రాజకీయపార్టీల నాయకులు ప్రకటించారు.

# నిబద్ధత అంటే ఇదే?

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు చేయలేని పనులు ఒక పంచాయితీ చేయటం విడ్డూరమే. అయితే ఆ పంచాయితీ నెల్లూరు రూరల్ మండల పరిధిలో వుంది. రూరల్ మండలం ఆనంవారి ఆధీనంలో వుందంటారు. కొత్తూరు గ్రామ పంచాయితీ కార్యదర్శి నరేంద్ర ఇటీవల కాలంలో గ్రామీణవార్తల్లో వ్యక్తిగా మారాడు. ఇయనేమంటున్నాడంటే? "నా పంచాయితీ పరిధిలో నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు జరిగినా, లే-అవుట్లు వేసినా కఠిన చర్యలు తీసుకుంటాను", అదే మాట మీద ఆయన నిలబడ్డానంటూ ఇటీవల నెల్లూరు సంతపేటకు చెందిన ఒక ప్రముఖుడి భార్య పేరుతో నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో సెల్లార్‌కు అనుమతి లేదని దగ్గరుండి పగలగొట్టించాడు. అదే విధంగా 14 తేది అనుమతిలేని లే-అవుట్‌ను గ్రామసిబ్బందిచేత ధ్వంసం చేయించి రాళ్లు తీయించి పంచాయితీ కార్యాలయానికి చేర్పించాడు. పంచాయితీ అనుమతి పొందిన తర్వాతనే లే-అవుట్‌లుగానీ, నిర్మాణాలుగానీ చేయాలని ఆయన స్పష్టం చేశాడు. ఉపఎన్నికల సమయంలో ఆనం వారికి తలనొప్పులు తెచ్చిపెట్టున్నాడు ఈ పంచాయితీ కార్యదర్శి. రేపో-మాపో నెల్లూరు కార్పొరేషన్‌లో కలువబోయే కొత్తూరులో ఇంతగా పూనుకోవటం రూరల్ కాంగ్రెస్‌నాయకులకు తలనొప్పిగా మారిందని అంటున్నారు. నరేంద్ర నిబద్ధత ఏంతమాత్రమూ తెలియదుగానీ నాయకులకు మాత్రం పరేషాన్ జాస్తి అయింది. పంచాయితీ పరిధిలోనే ఇలా అయితే నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఇళ్లనన్నింటినీ నేలమట్టం చేయాల్సిందే? మంచిని ఎవరైనా ఆహ్వానించాల్సిందే. అయితే అది మంచేనా అనేది ఇక్కడ ప్రశ్న?

# కొండక్రింది పల్లెలపై అతిసార బండ

ఉదయగిరి మండలపరిధిలోని కొండ క్రింద్ గ్రామమైన బండగానిపల్లెలో అతిసార విజృంభించింది. ఈ గ్రామానికి రవాణా సౌకర్యంలేదు. అందువల్ల ఈ ఊరిలో హెల్త్ సబ్ సెంటర్ వున్నా వారు వారానికి ఒక్కసారి మాత్రమేవస్తారు. 11వ తేదీ నుండి మొదలైన అతిసార 14వ తేదీలోగా సగం గ్రామానికి సోకింది. అప్పటిదాకా ఈ విషయం బయటవారికెవ్వరికీ తెలియలేదు. వ్యాధి బారిన పడ్డవాళ్లను కొందరిని నెల్లూరుకు తీసుకొని రావటం జరిగింది. వేసవి సెలవులకు గ్రామాలకు చేరుకున్నవారు భయపడి తిరిగి వెళ్ళిపోయారు. ఆరోగ్య సిబ్బంది ఈ గ్రామానికి అందనంత దూరంలో వుంటున్నారు. వారిపై తనిఖీ అధికారులు ఈ కొండక్రింద పల్లెకురారు. అందువల్ల హెల్త్ ఉద్యోగస్తులది ఇష్టారాజ్యం. ఈ గ్రామంలోనే ఫిబ్రవరిలో విపరీతంగా విషజ్వరాలు ప్రబలాయి. వాటి నుంచి కొంచెం తట్టుకొనేలోగానే అతిసార ముట్టుముట్టింది. అధికారులు తగిన చర్యలు చేపట్టకపోతే ప్రాణనష్టాలు భారీగా జరిగే అవకాశాలున్నాయి.

# మత్స్యకారులకు సదస్సు


కావలి రూరల్ మండలం తుమ్మలపెంట గ్రామం పంచాయితీ కార్యాలయంలో 15వ తేదీ ప్రమాదాలపై మత్స్యకారులకు నావికాదళం అధికారులు అవగాహనా సదస్సు ఏర్పాటుచేశారు. నావికాదళం కమాండర్ ఎస్.దత్తు భూకంపం వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. సదస్సులో కావలి తహశీల్దారు శేషగిరిరావు, తుమ్మలపెంట పంచాయితీ కార్యదర్శి ఇరీన్‌తార, మత్స్యకారులు పాల్గొన్నారు.


7వ వర్ధంతి

మరువలేని నీ తీపి జ్ఞాపకాలతో
నిత్యం నీ మధురస్మృతులతో

భర్త
కె.వి.రమణయ్య
సీనియర్ పాత్రికేయులు

కుటుంబ ఉన్నతికి అహర్నిశలు
శ్రమించిన మా యింటి దైవం
ఉన్నతమైన వ్యక్తిత్వంతో అందరి
మంచి కోరుకునే మా ఇంటిదీపం
మా అమ్మను స్మరిస్తూ...




శ్రీమతి కనుపర్తి రమాదేవి

| | | | | |
|---|---|---|---|---|
| కుమారులు | - కోడళ్లు | కుమార్తెలు | - | అల్లుళ్లు |
| కనుపర్తి రామకృష్ణప్రసాద్ | - మీన | దంటు సీతాలక్ష్మి | - | దంటు విశ్వనాథసూరి |
| కనుపర్తి దయాశంకర్ | - రేణుక | చుండి జ్యోతిలక్ష్మి | - | చుండి వెంకటనరసింహాశర్మ |

మనుమలు - మనుమరాళ్లు

మృదుల, నితిన్ భరద్వాజ, రమానందిక, మానస, మౌనిక, సంతోషి మేఘన, సంతోష్ కౌశిక్.

## ఎట్టెట్టా...?



ఏందిరా సుబ్బయ్యా... హుషారుగా వున్నావే...? ఏం లేదు రెడ్డా... ఈసారి ఎలచ్చన్లలో ఏ మాత్రం గిట్టుబాటవుద్దా... అని ఆలోచిస్తున్నా. పోయినమాలి తలకు వెయ్యిరూపాయల లెక్కన కాంగ్రేసోళ్లు ఇచ్చారు. ఈమాలి ఏ పార్టీవోళ్లయినా వెయ్యికి తక్కువిస్తే తీసుకునేదిలేదని మా గూడెవోళ్లు రాతిరి మీటింగెట్టి తీర్మానం సేసారు.

ఆదేందిరా... అసలు ఓట్లు అమ్ముకోవడమే తప్పు... దీనికి మళ్లీ తీర్మానాలా... తప్పు కదా...?ఎందుకు తప్పవుద్దయ్యా...? వాళ్లు దోసుకున్న దాన్లోదింతే కదా మాకిస్తాండ. పాత రోజుల్లో ఐదేళ్లకోమాలి వచ్చినా ఇంతిచ్చేవోళ్లు కాదు... కాని ఇప్పుడు రెండేళ్లకో మూడేళ్లకో వొచ్చి వేలకువేలు ఇత్తున్నారు. ఆళ్లు సంపాదిత్తుంటేనే కదా మాకిచ్చేది...?

భలే వాడివిరా... నువ్వు ఒక్క రూపాయి తీసుకోకుండా ఓటు వేసి గెలిపించిన రోజే నీకు కావలసిన పని నిలదీసి అడిగి మరీ చేయించుకోవచ్చు. నీ హక్కు కోసం ఎంతటివాడినైనా ఉతికి పారేయొచ్చు. ఇలా డబ్బు తీసుకుని ఓటేస్తే... నీకు మళ్లీ ఎలక్షన్లు వచ్చే దాకా గెలిచినోడు కనపడడు ఈ విషయాన్ని ఒక్కసారైనా మీ గూడెమోళ్లు ఆలోచించారా...?

ఆ... అదంతా మాకెందుకయ్యా... పోయినమాలి మూడు పార్టీలోళ్లు కలిసి తలకు పదిహేడొందలిచ్చారు. మీ ఇంట్లో అప్పుడు ముగ్గురమే వున్నాం. ఇప్పుడు మా పెద్దోడికీ కోడల్నీ ఆడి కొడుకునీ రమ్మన్నా. మొత్తం మాకు ఆరు ఓట్లుంటాయి. తలకి మూడువేలు వచ్చినా ఆరు మందికి పెద్దెనిమిదేలొత్తాయి. ఎన్ని రోజులు కూలీనాలీ చేస్తే ఇంత సైసలొస్తాయో చెప్పు రెడ్డా...?

మూర్ఖుడా... చెప్పేది వినరా... రేపు పట్నంలో చదువుతున్న మీ మనవడికి ఉద్యోగం కావాలని నువ్వు ఇదే యం.పి. దగ్గరికో, యం.యల్.ఏ దగ్గరకో వెళ్లాలి. అప్పుడు నీ దగ్గర నుండి ప్రతిఫలంగా ఏ లక్షో రెండు లక్షలో నిన్నడుగుతాడు. ఎందుకియ్యాలి అని నువ్వు అడిగితే. నీకు డబ్బులిస్తేనే కదరా నాకు ఓటేశావని నిన్నే ప్రశ్నిస్తాడు. ఈరోజు నవ్వే పెద్దెనిమిదివేలు కావాలా... రేపు నీ మనవడికి రాబోయే ఉద్యోగం కావాలా ఆలోచించుకుని నిర్ణయించుకో...?

ఎట్టెట్టా...?

# అవినీతిని తరిమికొట్టండి

### ఆత్మకూరు, నెల్లూరురూరల్ రోడ్‌షోలలో చంద్రబాబు



కార్యకర్తల చేత ప్రమాణం చేయిస్తున్న చంద్రబాబునాయుడు

కాంగ్రెస్ దొంగలపార్టీ అయితే వైయస్సార్‌కాంగ్రెస్ గజదొంగలపార్టీ అని, ఒకే చెట్టుకొమ్మలైన ఈ రెండు పార్టీలను తరిమికొట్టాలని తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల 16, 17తేదీలలో ఆయన ఆత్మకూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్లమెంట్ అభ్యర్థి వంటేరు వేణుగోపాలరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. 16వ తేదీ మర్రిపాడు మండలం, అనంతసాగరం మండలం, ఆత్మకూరులలో నిర్వహించిన చంద్రబాబు రోడ్‌షోలకు విశేషస్పందన కనిపించింది. 17వ తేదీ నెల్లూరు రూరల్ గ్రామాలలో ఆయన రోడ్‌షో విజయవంతంగా సాగింది. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ... తన తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకుని వేలకోట్ల రూపాయలు దోచుకున్న జగన్‌కు జైలు తప్పదన్నారు. జగన్ వల్ల రాష్ట్రానికే అప్రతిష్ట వచ్చిందని, పారిశ్రామికవేత్తలు, అధికారులు అవినీతికేసుల్లో జైలుకు పోతుండడంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలెవరూ ముందుకు రావడంలేదన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి పనిలేని, పసలేని ముఖ్యమంత్రని, ఇసుక మాఫియా, మద్యం మాఫియాలకు రాష్ట్రాన్ని ధారాదత్తం చేసాడని ఆరోపించారు. సీఎం సోదరులు కలెక్షన్‌లకు కౌంటర్‌లు తెరిచారని దుయ్యబట్టారు. తెలుగుదేశం ప్రభుత్వహయాంలో రాష్ట్ర ఆదాయవనరులను పెంచితే, కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు ఆ వనరులను దోచుకుతింటున్నారని ఆయన విమర్శించారు.

చంద్రబాబు పర్యటనలో పార్లమెంటు అభ్యర్థి వంటేరు వేణుగోపాలరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పార్టీ ప్రధానకార్యదర్శి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పార్టీ ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ గూటూరు కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# అత్యధిక మెజార్టీకి కృషి చేస్తాం


**- ఆదాల**



నెల్లూరు పార్లమెంటు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి టిక్కవరపు సుబ్బరామిరెడ్డికి ఎన్నికలలో అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషిచేస్తామన్నారు సర్వేపల్లి శాసన సభ్యుడు ఆదాల ప్రభాకరరెడ్డి. 15వ తేదీ ఇందుకూరుపేట కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి టీయస్‌ఆర్ సొంత మండలం అయినందువల్ల ఈ ప్రాంతంలో తెలుగుదేశం, వైయస్సార్సీల నుండి పలువురు నాయకులు, కార్యకర్తలతో పాటు కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులౌతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇది శుభపరిణామంగా ఆయన విశ్లేషించారు. మండలంలోని కాంగ్రెస్ పెద్దలందరూ పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొనున్నారని, ఇందుకూరుపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ ఉపఎన్నికలో ప్రథమస్థానంలో నిలువనుందని ఆయన వెల్లడించారు. సమావేశంలో సివి.శేషారెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, దేవిరెడ్డి రవీంద్రరెడ్డి, గునపాటి సతీష్‌రెడ్డి, పేట రామయ్య, యస్.శ్రీనివాసులు, ఉడతా వెంకటశేషయ్య, చెంచుకిషోర్‌లు పాల్గొన్నారు.

# నెల్లూరులో ప్రతిష్టాత్మక డయాబెటిస్ ప్రాజెక్ట్

### అన్ని పాఠశాలల విద్యార్థులకు డయాబెటిస్ స్క్రీనింగ్ పరీక్షలు



పాఠశాల విద్యార్థుల్లో మధుమేహ వ్యాధి నిర్ధారణ కొరకు దేశవ్యాప్తంగా డయాబెటిస్ స్క్రీనింగ్ పరీక్షను పైలెట్ ప్రాజెక్ట్‌గా కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ చేపట్టింది. ఈ ప్రాజెక్ట్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్, తమిళనాడులోని థేణి. అస్సాంలోని డిబ్రూఘడ్, రాజస్థాన్‌లోని భిల్వారా, మధ్యప్రదేశ్‌లోని రత్లాం, జిల్లాల పరిధిలోని పాఠశాలల్లో నిర్వహించనున్నారు. మొత్తం ఏడు రాష్ట్రాలలోని ఏడు జిల్లాలలో ఈ కార్యక్రమం క్రింద అన్ని తరగతుల విద్యార్థులకు డయాబెటిస్ స్క్రీనింగ్ జరుగుతుంది. ఈ మేరకు బుధవారం రాజ్యసభలో కేంద్ర మంత్రి గులాంనబీ ఆజాద్ ప్రకటించారు. ఇందుకు అవసరమైన నిధులను కూడా విడుదలచేయడం జరిగిందని ఆయన అన్నారు.

# సత్తావున్న నేత సుబ్బరామిరెడ్డి

**- మంత్రి ఆనం**



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఈ నెల 12న నెల్లూరు 4వ డివిజన్ పరిధిలోని వేణు గోపాలనగర్‌లో కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవను మాటల్లోకాకుండా చేతల్లో చూపించే చేవవున్న నాయకుడిగా టి.సుబ్బరామిరెడ్డిని అభివర్ణించారు. నెల్లూరు లోక్‌సభకు సుబ్బరామిరెడ్డి వంటి నాయకుడు పోటీచేయడం ఒక మంచి అవకాశమని, ఈరోజు మనం పోరాడి ఆయనను గెలిపిస్తే, రేపు మనకోసం ఆయన కేంద్ర ప్రభుత్వంతోనైనా పోరాడి నెల్లూరు అభివృద్ధికి నిధులు తేగలరన్నారు. నేటి తరానికే కాకుండా భావితరానికి సైతం ఉపయోగపడేలా సుబ్బరామిరెడ్డి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలరన్నారు. దేశాన్ని ఇంతవరకు అభివృద్ధి పథంలో నడిపింది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనన్నారు. నెల్లూరు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ఒక్కసారి ప్రజలు తనకు అవకాశమిస్తే వందేళ్లకి సరిపడా గుర్తిండిపోయేలా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానన్నారు. పేద, బడుగు, బలహీన, మైనార్టీ ప్రజల మంచిచెడుల గురించి ఆలోచించేది కాంగ్రెస్‌పార్టీయేనన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్‌ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డీసీసీ ఇన్‌ఛార్జ్ అధ్యక్షులు చాట్ల నరసింహరావు, కాంగ్రెస్ నాయకులు రంగయ్యనాయుడు, రావుల జ్యోతి, పుట్టా రామకృష్ణారెడ్డి, కిన్నెర ప్రసాద్, పెళ్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రను తిరగరాస్తాం

**- మేకపాటి**



సభలో ప్రసంగిస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

రాష్ట్ర రాజకీయ చరిత్రను వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తిరగరాయమన్నారని నెల్లూరు లోక్‌సభ వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో ఏర్పాటుచేసిన సభలో పీఆర్పీ నాయకుడు ఎం.ద్వారకానాథ్ అధికారికంగా వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సభలో పాల్గొన్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ ఇమేజ్‌తో రాష్ట్రంలో రాజకీయ రికార్డులు బద్దలు కానున్నాయన్నారు. 2014ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ కనీవినీ ఎరుగని విజయం సాధించడం, జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమైపోయాయన్నారు. రేపు జరుగనున్న ఉపఎన్నికల్లో కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీల బ్రతుకేమిటో, భవిష్యత్తేమిటో ప్రజలు తేల్చబోతున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అసమర్థపాలన సాగుతుంది. ప్రజాసంక్షేమం కోసం వై.యస్. పెట్టిన పథకాలన్నింటిని ఈ ప్రభుత్వం ఆపేసింది. వై.యస్. ద్వారా పదవులు పొందిన నాయకులు తిన్నింటి వాసాలు లెక్కపెట్టినట్లుగా ఈరోజు ఆయన కుటుంబంపైనే ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు ఇలాంటి వారికి బుద్ధిచెప్పే సమయం ఆసన్నమైందన్నారు.

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ముక్కాల ద్వారకానాథ్ లాంటి ఎంతోమంది ఉత్సాహవంతులైన యువకులు ఈరోజు జగన్ విధానాల పట్ల ఆకర్షితులవుతున్నారన్నారు. ఆదర్శాలకు కట్టుబడి తన పదవినే వదులుకున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డిని భారీమెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ జిల్లాకు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరుపెట్టింది వైయస్సేనని, అందుకే ఆర్యవైశ్యులకు ఆయనంటే ఎంతో అభిమానమన్నారు.

ఈ సమావేశంలో వైయస్సార్ సిపి నాయకులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఆనం వెంకటరమణారెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, ముప్పసాని శ్రీనివాసులు, బి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### జిల్లా అంతటా టి.యస్.ఆర్. హవా...!

### లీడర్‌లో ఉత్తేజం.. కేడర్‌లో ఉత్సాహం..

# కాంగ్రెస్‌లో సమరోత్సాహం!


- ఆత్మకూరులో విజయవంతమైన కార్యకర్తల సమావేశం
- వింజమూరులో దిగ్విజయంగా జరిగిన బహిరంగసభ
- నెల్లూరులో మేధావుల సమావేశానికి అనూహ్యస్పందన

ఒక నాయకుడు తలచుకుంటే... జనం మనసులను మార్చగలడు. పరిస్థితులను తలక్రిందులు చేయగలడు. ప్రతికూల వాతావరణాన్ని అనుకూలం చేసుకోగలడు. నిన్నటిదాకా జిల్లా కాంగ్రెస్‌లో నిరుత్సాహం ఆవరించి వుంది. కాని ఈరోజు అదే కాంగ్రెస్‌లో ఎనలేని ఉత్సాహం కనిపిస్తుంది. లీడర్ ఉరుకులు తీస్తున్నాడు... కేడర్ పరుగులు పెడుతుంది. ప్రతి ఇంటా, ప్రతి చోటా కాంగ్రెస్‌జెండా రెపరెపలాడుతుంది. నిద్రావస్థలోవున్న పార్టీ ఇప్పుడు పట్టాలెక్కి బుల్లెట్‌రైలులా దూసుకుపోతుంది. కాంగ్రెస్ నుండి ఇతర పార్టీల్లోకి వలసలు ఆగాయి. ఇతర పార్టీల నుండి కాంగ్రెస్‌లోకి వలసలు పెరిగాయి. దీనికంతటికీ కారణం నెల్లూరు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా తిక్కవరపు సుబ్బరామిరెడ్డి రావడమే!

ఆయన అభ్యర్థిత్వంతో జిల్లా కాంగ్రెస్‌లో నూతనోత్సాహం ఉరకలు ఎత్తుతోంది. ఈ నెల 15, 16తేదీలలో జిల్లాలో విజయవంతమైన ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి పర్యటనే కాంగ్రెస్ పాపులారిటీ పెరిగిందనడానికి నిలువెత్తు సాక్ష్యం. 15వ తేదీ ఆత్మకూరులో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం చివరకు బహిరంగసభగా మారితే, కాంగ్రెస్‌పార్టీ ఉనికే లేదనుకున్న వింజమూరులో 16వ తేదీన ముఖ్యమంత్రి పాల్గొన్న బహిరంగ సభ విజయంతం కావడం నూటికి నూరుపాళ్లు ప్రజలలో సుబ్బరామిరెడ్డి పట్ల పెరుగుతున్న అభిమానానికి నిదర్శనం.

మొదట కార్యకర్తల సమావేశమన్నారు... ఆ విధంగానే ప్రచారం చేశారు. కాని కార్యకర్తల సమావేశానికే కార్యకర్తలు వేలాదిగా తరలి రావడంతో అదికాస్తా బహిరంగసభగా మారిపోయింది. మంగళవారం ఆత్మకూరులోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ప్రాంగణంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం బహిరంగ సభనే తలపించింది. ఈ సమావేశంతో కాంగ్రెస్ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం మొదలైంది. ఆత్మకూరు నియోజకవర్గంలో ఆనం ప్రాబల్యానికి ఈ సమావేశం అద్దంపట్టింది. నెల్లూరు పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి తిక్కవరపు సుబ్బరామిరెడ్డి మీ అమూల్యమైన ఆశీస్సులు కావాలని ప్రజలను సభాముఖంగా కోరారు.

ఈ కార్యక్రమాలలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మున్సిపల్‌శాఖామంత్రి యం.మహీధర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, మాజీఎమ్మెల్యేలు మాదాల జానకిరాం, సి.వి.శేషారెడ్డి, కంచర్ల శ్రీహరినాయుడు, మాజీమేయర్ భానుశ్రీ, కాంగ్రెస్ నాయకులు పనబాక కృష్ణయ్య, చాట్ల నరసింహారావు, వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, రాచాల రవికుమార్‌యాదవ్, డాక్టర్ ఆదిశేషయ్య, ఇందూరు వెంకటరమణారెడ్డి, చేవూరు శ్రీధర్‌రెడ్డి, తాళ్లూరి గిరినాయుడు, తుంగా దయాకర్‌రెడ్డి, పుట్టం బ్రహ్మానందరెడ్డి, ఆనం మురళీరెడ్డి, బుట్టి పట్టాభి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సన్నపరెడ్డి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అల్లా... ఆశీర్వదించు...



టి.యస్.ఆర్. మీ వాడు.. గెలిపించండి - సీఎం



ఆశీర్వదించండి.. అండగా నిలుస్తా - టి.యస్.ఆర్



హస్తంకు ఓటు... అభివృద్ధికి రూటు - ఆదాల



చిట్టితల్లికి తాతయ్య ముద్దులు



అభిమాన నేతకు అభినందన మాల




అతిరథులకు గజమాల



# ఓటర్లను చైతన్య పరచండి

## వ్యాపార సంఘాలను కోరిన కలెక్టర్



ఓటరుగా గర్విస్తున్నాం - ఓటువేసేందుకు సిద్ధంగా వున్నాం అనే నినాదంతో ప్రతి ఓటరును చైతన్యవంతంచేసి ఓటింగ్ శాతాన్ని పెంపొందించుటలో వ్యాపార సంఘాల ప్రతినిధులు ప్రధానపాత్ర వహించాలని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ కోరారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో 15వ తేదీ ఓటుహక్కుపై ఓటర్లకు అవగాహన కల్పించుటలో వ్యాపార సంఘాల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ మాట్లాడుతూ ప్రధానంగా పోలింగ్‌రోజున ఎక్కువ సంఖ్యలో ఓటర్లు స్వచ్ఛందంగా హాజరై తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా ఓటర్లకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీదేనన్నారు. ఓటువేయడం హక్కేకాకుండా ఓ సామాజిక బాధ్యత అని తెలియజేయాలన్నారు. ప్రతి ఓటరు డబ్బు, మద్యం, వస్తువులు, కానుకలు మొదలగు ప్రలోభాలకు లోబడకుండా నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకొనేలా చైతన్యవంతుల్ని చేయాలన్నారు. అలాగే పోలింగ్ రోజున ఓటింగ్‌కు ఆటంకం కలిగించకుండా నిర్బంధించే వారి నుండి భయాన్ని తొలగించి, నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకొనేలా చూడాలన్నారు. ఓటింగ్‌శాతం తక్కువున్న నియోజకవర్గాలలో నెల్లూరురూరల్, సిటీ నియోజకవర్గాలలో దాదాపు 52శాతం మాత్రమే పోలింగ్ జరుగుతుందని అటువంటి నియోజకవర్గాలలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించి ఎక్కువశాతం పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. ఓటు విలువ తెలియని వారికి, అక్షరాస్యులైన వయోజనులకు ఓటు విలువ తెలియజేసి ఓటువేసేలా చూడాలన్నారు. ఓటుహక్కు వినియోగంపై సినిమా థియేటర్లలో స్లైడ్ ద్వారా, ఫ్లెక్సీలు, కరపత్రాలు ద్వారా అవగాహన కల్పించడమే కాకుండా, వ్యాపార సంఘాల ప్రతినిధులు భాగస్వామ్యంతో ర్యాలీలు, సంబంధిత షాపుల వద్ద కరపత్రాలు పంపిణీ ద్వారా అవగాహన కల్పించటంలో పూర్తి సహకారం అందించాలన్నారు. 457కళాజాతాల ద్వారా ఓటుహక్కు వినియోగంపై ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు, కుల,మత తారతమ్యం లేకుండా, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటుహక్కును వినియోగించుకొని, సమాజాభివృద్ధితో పాటు, దేశాభివృద్ధికి పాటుపడేలా చూడాలన్నారు.

సమావేశంలో అదనపు జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, నగరకమీషనర్ టి.యస్.ఆర్. అంజనేయులు, నెల్లూరు ఆర్.డి.ఓ. శ్రీమతి మాధవీలత, వివిధ వ్యాపారసంస్థల సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అల్లూరు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

అల్లూరు రామకృష్ణా విద్యాలయంలో ఈ నెల 13న జరిగిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంతో కళాశాల ఆవరణం అంతా ఆనందం వరుచుకుంది. ఎప్పుడో ఈ ఆవరణంలో విద్యనభ్యసించి ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా ఆరోజు అక్కడ కలుసుకొని తమ అనుభవాలు, అనుభూతులు పంచుకున్నారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులను 50మంది వయోవృద్ధులైన పూర్వ విద్యార్థులను గౌరవంగా సత్కరించారు. పాఠశాల జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకొంటూ ఒకరికొకరు నాటిని నెమరువేసుకుంటూ అక్కడ పండుగ వాతావరణాన్ని తలపింపజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణా విద్యాసంస్థల కరస్పాండెంట్ అల్లంపాటి విజయవర్ధన్‌రెడ్డి పూర్వవిద్యార్థులైన కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, బీద రవిచంద్ర, బీద గిరిధర్, రామకృష్ణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మేకా రామకృష్ణారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మధు, ఎంఇఓ అంకయ్యలు పాల్గొన్నారు.

# జగన్ పార్టీలో కొమ్మి, బొమ్మి

(3వ పేజీ తరువాయి)

వచ్చేసాడు. కాని ఇంతలోనే మళ్లీ పార్టీ మారాల్సి వచ్చింది. చాలా తక్కువ టైంలో ఎక్కువ పార్టీలు మారాడనేదే ఆయన మీద వున్న మచ్చ. ఇక బలం, బంధుత్వం చూసుకుంటే ఆత్మకూరులో ఎవరికీ తగ్గడు. ఇప్పుడు జగన్‌తో సైతం ఆయన నేరుగానే మంతనాలు జరిపి పార్టీ తీర్థం తీసుకోబోతున్నారు. కొమ్మి లక్ష్మయ్య, బొమ్మిరెడ్డి రాఘవలు మొన్నటిదాకా సన్నిహితంగా మెలిగినవాళ్లే! 2007ఎమ్మెల్సీ ఎన్నికలలో రాఘవ గెలుపుకు కొమ్మి ఎంతగానో కృషిచేసాడు. కాని ఆ తర్వాతే వారి రాజకీయదారులు వేరయ్యాయి. ఇద్దరూ వైయస్సార్ కాంగ్రెస్‌లోచేరితే ఇద్దరి లక్ష్యం ఆత్మకూరు సీటే! మరి ఎవరు ఇందులో నెగ్గుతారో చూడాలి. తెలుస్తున్న సమాచారం ప్రకారం కొమ్మికే ఎక్కువ అవకాశాలు వున్నాయి.

# వాడుతున్న నేదురు'మల్లి'

(3వ పేజీ తరువాయి)


దూరంగా వున్నా, అందరిలా వైయస్సార్‌తో ప్రచారంలో పాల్గొన్నా ఒకటే. ఒరిగేదేమీ లేదు. పెద్దాయన పెత్తనం పోయింది. వర్గం మాయమైంది. రాజ్యసభ సభ్యత్వం ఉన్నన్ని రోజులే అధిష్టానం గుర్తింపు ఉంటుంది. అనక అది కూడా కరువే. ఏది ఏమైనా 30సంవత్సరాల పాటు ఆయన ప్రభ వెలిగింది. వైరి కాంగ్రెస్ వర్గాలకు గట్టి ఫైట్ ఇచ్చాడనే చెప్పొచ్చు. ఆ రోజులు చెల్లిపోయాయి. ప్రస్తుతం జిల్లాలో ఆయన్ను అనుకొనే వారు లేకుండా పోయారు. అందుకే సుమతీకారుడంటాడు "తెప్పలుగా చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు" అని.

# స్థాయి తగ్గుతోంది..!

(మొదటిపేజీ తరువాయి)

అరగంటసేపు మాట్లాడారు. మంగలి కృష్ణ స్థాయి ఏంటి? చంద్రబాబు స్థాయి ఎక్కడ? చంద్రబాబు స్థాయికి మంగలి కృష్ణ ఎదగాడా? లేక మంగలి కృష్ణ స్థాయికి చంద్రబాబు దిగజారాడా? జగన్ తిరుమలలో శ్రీవారి దర్శనం చేసుకున్న సందర్భంలోనూ చంద్రబాబు మతం పేరుతో విమర్శలకు దిగాడు. అధికారం కోసం ఆయన ఎంతగా తపించిపోతున్నాడో, ఎంతగా బాధపడిపోతున్నాడనేది ఆయన తన స్థాయి మరచి చేస్తున్న విమర్శలను బట్టే అర్థమవుతుంది. దిగజారి బజార్న కెక్కితే అధికారం వస్తే పనయితే అందరూ అదే పనిచేయరా?

# హనుమంతుడి జన్మదిన వేడుకలు



శ్రీరామ భక్తుడైన హనుమంతుడి జన్మదిన వేడుకలు మంగళవారం నెల్లూరులోని పలుచోట్ల ఆలయాల్లో భక్తిపూర్వకంగా జరిగాయి. మూలాపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలోగల ఆంజనేయస్వామిని వెండికమలపాకులతో, వడమాలతో అలంకరించి ఒంటె వాహనంపై ఊరేగించారు. ఆలయ చైర్మన్ తుమ్మలసుబ్బారెడ్డి పర్యవేక్షణలో జరిగిన స్వామి అభిషేకాలకు వేమూరు గోపి, రవిస్వామి, బాలాజి స్వాములు ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాయాజీ వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో లక్షపత్రి పూజ, హోమాలు నిర్వహించి పూర్ణాహుతి అర్పించారు. దర్గామిట్టలోని రామ్‌నగర్‌లోని శబరి క్షేత్రంలోని హనుమంతునికి ఉదయాన అభిషేకాలు, సుందరకాండ పారాయణం, లక్షమల్లెలార్చన కడువైభవంగా జరుగగా సాయంత్రం పిల్లలకు సర్వదోష నివారణకై వెండి ఆంజనేయస్వామి పతకాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమాలకు పలగాటి శ్రీనివాసులురెడ్డి, సునీల, గార్ల కౌసల్యమ్మ, పిడూరు సుబ్బారెడ్డి, అరుణమ్మలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ వెన్నూరు వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షణలో భక్తిప్రపత్తులతో ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల భావనాచార్యులు ఈ పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ స్వామివారిని దర్శించారు. ఫత్తేఖాన్‌పేటలోని రాములవారి గుడిలో ఆంజనేయస్వామికి భక్తులు ప్రణమిల్లగా, మైపాడుగేటు వద్ద స్వామి ఆలయంలో రాత్రి 7గంటలకు పుష్ప యాగ కార్యక్రమం నిర్వహించారు.

# పెరుగుతున్న క్రేజ్!

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా జనం లక్షల్లో హాజరౌతున్నారు. రేపు అరెస్ట్ అంటే పరిస్థితి ఏమిటి? ఎలాగుంటుంది? సోనియాను జగన్ ఎప్పుడో పక్కనపెట్టేశాడు. సోనియా మాత్రం ఆయనను శ్రీకృష్ణ జన్మస్థానంకు పంపితేగాని వదిలేట్టు లేదు. ఉపఎన్నికల్లో కాంగ్రెస్ యువనేతను ఎదుర్కోలేక పోతుందనేది స్పష్టం. ఇప్పటికే ఆయనపై ప్రజల సానుభూతి కుంభవర్షంలా కురుస్తోంది. పోలింగ్ జరిగే లోపుగా వైయస్సార్సీ అధినాయకుని అరెస్టు చేయటం జరిగితే, రాష్ట్రంలోని 18 అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కోల్పోతుంది. ఇది తథ్యం. ఒకవేళ ఎన్నికల అనంతరం అదుపులోకి తీసుకుందామనుకుంటే అప్పుడు కూడా 18 అసెంబ్లీస్థానాల్లో సింహభాగం ఆయన పరమే అవుతాయి. జగన్ అక్రమాస్తుల కేసులో మొత్తం 71మందిని నిందితులుగా సిబిఐ పేర్కొనివుంది. కొందర్ని అప్రూవర్లుగా వాడుకుంటుంది. ఏది ఏమైనా జగన్, జగన్‌పార్టీ తనకు నరం దెబ్బ కావాలి. అదే అధినేత్రి ఆలోచన. జరుగుతుందా? జనం జరగనిస్తారా? ఇన్ని రకాలుగా అధిష్టానం బెదిరిస్తున్నా జగన్‌రెడ్డి బెదరడంలేదు. తనను అధినేత్రి వేధించేకొద్దీ జనంలో క్రేజ్‌ను పెంచుకుంటూపోతున్నాడు. తనదైన తరహాను, పంథాను మార్చుకోకుండా జగన్ జనం అండగా ముందుకుపోతున్నాడు. చట్టం తనపని తాను చేసుకుపోతోంది. జనం తమ పని తాము చేసి చూపించబోతున్నారు.

# ప్రతాప్ ప్రచారం


కావలి నియోజకవర్గ పరిధిలోని ముసునూరు, హరిజనవాడ, వడ్డిపాలెం, కొత్తపల్లి, హరిజనవాడ, అరుంధతీవాడలలో 15వతేదీ వైయస్సార్సీ ఇన్‌ఛార్జి రామిరెడ్డి ప్రతాపకుమార్‌రెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెల్లూరు పార్లమెంట్ స్థానానికి వైయస్సార్సీ అభ్యర్థి రాజమోహనరెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో పులిమి కృష్ణారెడ్డి, పులిమి రమణారెడ్డి, ద్రోణాదుల కృష్ణారెడ్డి, కలికి ప్రభాకరరెడ్డి, కోటేశ్వరరావు, మాల్యాద్రి, మనోహర్‌రెడ్డి, పూనూరు శివకుమార్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, సొమినేని రామారావు, చిమ్మిలి కృష్ణయ్య, చిమ్మిలి వెంకటేశ్వర్లు, మోహన్, చింతం బాబులరెడ్డి, పాలడుగు వెంకట్రావు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

### కళాంజలి అనంత్‌కు మాతృవియోగం

కళాంజలి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కళాంజలి అనంత్ మాతృమూర్తి శ్రీమతి [illegible] ఈనెల 17వతేదీ అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమెకు ముగ్గురు కుమారులు వారిలో కళాంజలి అనంత్ ఒకరు. నెల్లూరులో పలు ప్రతిష్టాత్మక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా అనంత్ అందరికి సుపరిచితుడే. [illegible] మరణానికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది "లాయర్".

### సంగమేశ్వరశాస్త్రి ఇక లేరు



[illegible] కార్యదర్శి, [illegible] స్వాతంత్ర్య [illegible] సామాజికసేవా కార్యకర్త [illegible] సంగమేశ్వరశాస్త్రి [illegible] తుదిశ్వాస విడిచారు. [illegible] శాస్త్రిగా అందరికీ సుపరిచితుడు. [illegible] ఈ నెల [illegible] విజయవాడ [illegible] ప్రయాణిస్తూ [illegible] గురయ్యారు. నెల్లూరు [illegible] ఆసుపత్రిలో చికిత్స పొందారు. [illegible] కీర్తిశేషులు [illegible] సంగమేశ్వరశాస్త్రి [illegible] వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది "లాయర్".

## విభిన్న కోణాలు.. విభిన్న ప్రాంతాలు...

# నెల్లూరు లోక్‌సభ తీరే వేరు!



**జాతీయ రాజకీయాలలోనే నెల్లూరు లోక్‌సభకు ప్రత్యేక గుర్తింపు వుంది. ఇక్కడ ప్రజలు ఎటువైపు మొగ్గుచూపితే జాతీయ రాజకీయాలు అటువైపే మొగ్గుచూపేవి. నెల్లూరులో పార్టీ గెలిస్తే, దేశవ్యాప్తంగా కూడా అందుకు అనుగుణంగా ఫలితాలుండేవి.**

2009కి ముందు నెల్లూరు లోక్‌సభ రూపం వేరు. ఈ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలతోనే నెల్లూరు లోక్‌సభ వుండేది. నెల్లూరు, సర్వేపల్లి, కోవూరు, ఆత్మకూరు, రాపూరు, అల్లూరు, గూడూరులు లోక్‌సభ పరిధిలో వుండేవి. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో నెల్లూరు లోక్‌సభ స్వరూపంలో భారీ మార్పు వచ్చింది. అంతకుముందు ఈ పరిధిలో వున్న సర్వేపల్లి, గూడూరు నియోజకవర్గాలు తిరుపతి లోక్‌సభలోకి వెళ్లగా, ఒంగోలు లోక్‌సభలో వుండిన కందుకూరు, కావలి, ఉదయగిరి అసెంబ్లీలు నెల్లూరు లోక్‌సభ పరిధిలోకి వచ్చాయి. కాబట్టి విభిన్న ప్రాంతాలకు, విభిన్న రాజకీయ కోణాలకు నెల్లూరు పార్లమెంటు వేదికయ్యింది.

డెల్టా, మెట్ట భూముల కలయిక ఇది. తూర్పున సముద్రతీరం... పడమర వెలుగొండలు... విభిన్న ప్రాంతాలు... విభిన్న వాతావరణం ఇక్కడ కనిపిస్తుంటుంది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కో ప్రత్యేకత. కందుకూరు మన రాజకీయాలకు పూర్తిగా కొత్త. అక్కడ రాజకీయాలు వేరు... మన రాజకీయాలు వేరు. స్థానిక పరిస్థితుల ప్రభావం అక్కడి రాజకీయాలపై ఎక్కువగా వుంటుంది. ఉదయగిరి చూస్తే రాజకీయంగా చైతన్యవంతమైన ప్రాంతం. 1983లో ఎన్టీఆర్ గాలి రాష్ట్ర మంతావీస్తే ఇక్కడ మాత్రం ఆ పార్టీ అభ్యర్థికి డిపాజిట్ రాని పరిస్థితి. బెజవాడ గోపాలరెడ్డి వంటి మహానాయకుడిని మట్టి కరిపించిన ప్రాంతం. వర్గరాజకీయాలకు పుట్టిల్లు. నెల్లూరుజిల్లాలోనే వున్నప్పటికి సమీపాన వున్న కడప ప్రభావం ఎక్కువ. కావలి నియోజకవర్గంది ఎప్పుడూ కొత్త కోణమే. కావలి ప్రజలు ఒకసారి ఎవరినైనా ఆదరించారంటే, వారిని అంత సామాన్యంగా వదులుకోరు. ఇక్కడ స్థానిక పరిస్థితుల ప్రభావం ఎక్కువ. కోవూరు పూర్తిగా డెల్టా ప్రాంతం. ఇక్కడి రాజకీయలపై కులప్రభావం ఎక్కువ. రెడ్ల పెత్తనం జాస్తి. ఆత్మకూరులో ఒకరి పెత్తనం అంటూ వుండదు. అయితే రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఎలా వుంటుందో ఆత్మకూరు కూడా ఆ వాతావరణానికి తగ్గట్లుగానే వుంటుంది. నెల్లూరు నగరం, రూరల్‌లో స్థానిక రాజకీయ నేతల ప్రభావం ఎక్కువ. పార్టీల కంటే నేతలే పట్టుబిగించి వుంటారు.

ఇంతకాలం నెల్లూరోళ్లు ఎక్కడున్నా రాజకీయంగా సంచలనాలు రేపుతుండేవాళ్లు. కాని రేపటి సంచలన రాజకీయాలకు ఇప్పుడు నెల్లూరే వేదికగా మారడం గమనార్హం.

# జనరంజకపాలన తెలుగుదేశందే!

**- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



సేవాభావమే పరమావధిగా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో వుంటూ ప్రజా సంక్షేమమే తనదిగా భావించే నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వంటేరు వేణుగోపాలరెడ్డి విజయానికి పూర్తిగా సహకరించాలని కోరారు టిడిపి జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. బుచ్చిరెడ్డిపాళెం ఎస్‌ఎస్ కల్యాణమండపంలో జరిగిన తెలుగుదేశం పార్టీ విస్తృత కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు జనరంజకమైన పాలన అందింది తెలుగుదేశపార్టీ పాలనాకాలంలోనే అని అన్నారు. ప్రజాధనం దుర్వినియోగం, వేల లక్షలకోట్ల దోపిడీ, భూముల పందేరం తదితరాలతో రాష్ట్రాన్ని దోచేసింది కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వమేనని ఆయన తేటతెల్లం చేశారు. సిబిఐ దర్యాప్తులో మూడు చార్జిషీట్లలో జగన్మోహన్‌రెడ్డి మొదటి ముద్దాయి అయినప్పటికీ ఆయనను అరెస్టుచేసే ధైర్యంలేని అసమర్థపాలన రాష్ట్రంలో నెలకొని వుందని విమర్శించారు. నెల్లూరులో జరుగుతున్న అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల పోటీలో వైయస్సార్ కాంగ్రెస్ నాయకులులేరని గాయత్రి, కె.యం.సి సంస్థలు ఎన్నికల పోటీలో ఉన్నాయని విమర్శించారు.

టిడిపి పార్లమెంటు అభ్యర్థి వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు ప్రజలను ఆదుకుంటామంటూ అంకెల గారడీతో ప్రజల ముందుకు ప్రచారానికి వచ్చారన్నారు. ప్రజాభిమానంతో ఎన్నికలలో విజయం సాధించిన వ్యక్తి ప్రజలకు అందుబాటులో వుంటాడని, పదవిలో వున్నా లేకపోయినా ప్రజాసంక్షేమం కోసమే పాటుపడతానని ఆయన హామీ ఇచ్చారు. ప్రచార కార్యక్రమంలో టిడిపి నేతలు బీద మస్తాన్‌రావు, గూటూరు కన్నబాబు, ఎర్రంరెడ్డి గోవర్ధన్, బెజవాడ ఓబులరెడ్డి, శ్రీమతి డా॥ఉక్కాల రాజేశ్వరమ్మ, దయాకరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో మండల టిడిపి నాయకులు కార్యకర్తలు, యన్‌టిఆర్, బాలకృష్ణ జూనియర్ యన్‌టిఆర్ అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధే నా ప్రధాన ధ్యేయం

**- డా॥ టి.యస్.ఆర్**



కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తున్న తిక్కవరపు సుబ్బరామిరెడ్డి

అధికారం డబ్బు శాశ్వతంకాదు మానవసేవ చేయటమే లక్ష్యంగా ముందుకు కొనసాగుతున్నానన్నారు నెల్లూరు పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి తిక్కవరపు సుబ్బరామిరెడ్డి. శ్రీమతి సోనియాగాంధీ ఆశీస్సులతో నెల్లూరు జిల్లా అభివృద్ధే ధ్యేయంగా ఉపఎన్నికల్లో నిలిచానన్నారు. ఈ నెల 13న మండల కేంద్రమైన సంగంలోని తుంగా దయాకరరెడ్డి కల్యాణమండపంలో ఆయన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థికమంత్రి ఆనం రామ నారాయణరెడ్డి మాట్లాడుతూ కేవలం అధికార దాహంతో, ముఖ్యమంత్రి సీటులో కూర్చొనేందుకే వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. సుబ్బరామిరెడ్డికి విశాఖ- నెల్లూరు రెండుకళ్లు అని, ఆయనను పార్లమెంటుకు పంపితే జిల్లా సర్వతోముఖంగా అభివృద్ధి జరుగుతుందని వివరించారు. రాష్ట్రంలో ఉపఎన్నికలు రావటానికి కారకులెవరని ఆయన కార్యకర్తలను ప్రజలను ప్రశ్నించారు. కేవలం స్వార్థంతో రోజుకొక పార్టీ మారుస్తున్న మేకపాటి సోదరులు రాజీనామాలు చేయక పోతే ప్రస్తుతం జిల్లాలో ఉపఎన్నికలు వచ్చేవే కావన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవకుమార్‌రెడ్డి, సివి.శేషారెడ్డి, తుంగా దయాకరరెడ్డి, తుంగా ఇందుధరరెడ్డి, డా॥కొండారెడ్డి, కె.బాలకృష్ణారెడ్డి, గంగపట్నం చంద్రశేఖరయ్య, పులగం వెంకట శేషారెడ్డి, కంఠాబత్తిన రఘునాథరెడ్డి, ప్రసాదరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో భారీసంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొనటం విశేషం.



టి.యస్.ఆర్, మంత్రి ఆనం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యువకులు

# సర్వమతం.. నా అభిమతం

## బుచ్చిరెడ్డిపాలెం దర్గాలో ప్రార్థనలు నిర్వహించిన సుబ్బరామిరెడ్డి

### ఘన స్వాగతం పలికిన ముస్లిం సోదరులు



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న టి.సుబ్బరామిరెడ్డి

ఈ నెల 13న బుచ్చిరెడ్డిపాళెంలో నెల్లూరు పార్లమెంటు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి తిక్కవరపు సుబ్బరామిరెడ్డికి మైనారిటీలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింల ప్రార్థనా స్థలంలో వారితో పాటు కలిసి ప్రార్థనలు నిర్వహించారు. ప్రచారంలో పాల్గొన్న సర్వేపల్లి శాసనసభ్యుడు ఆదాల ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకానికి దివంగతనేత వైయస్.రాజశేఖరరెడ్డి 350కోట్ల రూపాయలు కేటాయించగా, నేటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి 3000కోట్ల రూపాయలు విడుదల చేయటం జరిగిందన్నారు. అదే విధంగా విద్యార్థుల ఫీజు రీఇంబర్స్‌మెంట్ కోసం 3500కోట్ల రూపాయలు కేటాయించటం జరిగిందన్నారు. కోవూరు మాజీ శాసనసభ్యుడు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఎవరి స్వార్థంతో మనమంతా ఉపఎన్నికలను ఎదుర్కోవాల్సి వచ్చిందో అందరూ ఆలోచించాలన్నారు. జిల్లా అభివృద్ధికి జాతీయస్థాయిలో పనులు చేయించగల వ్యక్తి మన పార్లమెంటు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి సుబ్బరామన్న అని ఆయన అన్నారు. కోవూరులో పార్టీమారి జగన్‌గాలిలో గెలిచిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్వతంత్రంగా నియోజకవర్గానికి ఒక పని చేయించగలడా? అని ఆయన ప్రశ్నించాడు. ప్రచారసభ జొన్నవాడ కూడలిలో భారీగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, మాజీ పోలీసుశాఖ ఉన్నతాధికారి చెన్నూరు ఆంజనేయరెడ్డి, సివి శేషారెడ్డి, పనబాక కృష్ణయ్య, యరటపల్లి శివకుమార్‌రెడ్డి, పురిణి హరిబాబు, మైనార్టీ నాయకులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

## మేషం

అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము.

వ్యాపారవృద్ధికి మీరు చేసిన కృషి ఇప్పుడు ఫలిస్తుంది. వృత్తివ్యాపారాలలో ఆదాయము బాగుంటుంది. గృహావసరాలకు అదనంగా ఖర్చులు పెరుగుతాయి. సంతానములను జాగ్రత్తగా చదువుకుంటారు. దైవ పుణ్యకార్యాలలో పాల్గొంటారు. విదేశప్రయాణాలు ఖరారు కాగలవు. స్థిరాస్తుల లావాదేవీలు సానుకూలంకాగలవు. అందరిని ఆకట్టుకొనే సామర్థ్యం ఉంటుంది.

## వృషభం

కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర 1, 2పాదాలు

వృత్తి యందు మంచి అవకాశాలు, వ్యాపార వర్గాలకు పెట్టుబడి అవకాశాలు, ఆదాయవృద్ధి ఉంటుంది. చేపట్టదలచిన పనికి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేసుకొంటారు. కుటుంబవ్యవహారాలలో భిన్నాభిప్రాయాల వల్ల టెన్షన్ ఉంటుంది. శుభకార్యనిర్ణయాలు జరుగడం. అవసర ప్రయాణాలుంటాయి. ఉద్యోగయత్నాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

## మిథునం

మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఇంట బయట ఖర్చులు ఎక్కువకాగలవు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఆర్థికావకాశాలు కొన్ని చేజారిపోవచ్చును. చిన్న విషయాలపై బంధు మిత్రులతో అభిప్రాయ భేదాలుంటాయి. షేర్లు పెట్టుబడులు నిరుత్సాహపరుస్తాయి. కుటుంబసౌఖ్యము బాగుంటుంది. శుభకార్యాలకు వనరుల సమీకరణ ప్రయత్నాలుంటాయి. దైవపుణ్యకార్యాలలో పాల్గొంటారు.

## కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థిక ప్రయోజనాలు బాగుండి వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు నిర్ణయంకాగలవు. కోర్టుకేసులలో కొంత ఊరట కలుగుతుంది. వృత్తిగత బాకీల వసూలు, చెల్లింపులుంటాయి. ఇంట శుభకార్యప్రయత్నాలు ఫలించి అనుకూల సమాధానాలు పొందుతారు. ప్రభుత్వపరంగా రావలసిన అనుమతులు లభిస్తాయి. గృహ పరికరాలు సమకూర్చుకుంటారు.

## సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కొన్ని ముఖ్య విషయాలపై కుటుంబసభ్యుల మధ్య చర్చలుంటాయి. క్రొత్త కాంట్రాక్టులు, నిర్మాణ అనుమతులందు కొద్ది ఆలస్యం జరుగవచ్చును. వృత్తి వ్యాపారాలలో నుంచి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. బంధు వర్గంలో అనారోగ్య వార్తలు వింటారు. స్థిరనిర్ణయాలతో అనుకున్న పనులు నెరవేరటానికై చందాలు, దానేషన్ వంటివి ఇవ్వవలసిన పరిస్థితి ఉంటుంది.

## కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆత్మీయులకు, బంధువర్గంలోను అనారోగ్య బాధలుంటాయి. షేర్లు పెట్టుబడి రంగాలలో స్వల్పలాభాలుంటాయి. ఒక ముఖ్య పనికై వనరులు సమకూర్చుకొనే ప్రయత్నాలు జరుగుతాయి. అదనపు ఖర్చులు పెరుగుతాయి. దూరప్రయాణాలుంటాయి. దైవపుణ్య కార్యక్రమాలలో పాల్గొంటారు. వాహనాలు యంత్రాల వల్ల గాయాలు తగులుతాయి. పోటీపరీక్షలు బాగా వ్రాయగలరు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది 18.05.2012 నుండి
తేది. 24.05.2012 వరకు.

ఈవారం వృషభంలో రవిబుధగురుశుక్రకేతువులు, సింహంలో కుజుడు, కన్యలో శని, వృశ్చికంలో రాహువు. మేష వృషభమిథునరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 24 గురువారము రోహిణికార్తె ప్రారంభము.

గురుమౌఢ్యమి జరుగుచున్నది.

**ముహూర్తములు లేవు.**

### వైశాఖ బహుళ పక్షతిథులు

| | | | |
|---|---|---|---|
| తే. 18 | శుక్ర | త్రయోదశి | రా॥గం.11.57ని॥ |
| తే. 19 | శని | చతుర్దశి | రా॥గం.1.31ని॥ |
| తే. 20 | ఆది | అమావాస్య | రా॥గం.3.57ని॥ |

### జ్యేష్ఠమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తే. 21 | సోమ | పాడ్యమి | రా॥గం.5.30ని॥ |
| తే. 22 | మంగళ | విదియ | పూర్తిగా |
| తే. 23 | బుధ | విదియ | ఉ॥గం.7.21ని॥ |
| తే. 24 | గురు | తదియ | ఉ॥గం.9.00ని॥ |

## తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థికపరంగా వృత్తి వ్యాపారాలలో అవకాశాలు తగ్గి ఆదాయం తగ్గుతుంది. షేర్లు పెట్టుబడులపై ఆదాయం తృప్తికరంగా ఉండదు. గృహ అవసరాల ఖర్చులు, వైద్య ఖర్చులు పైనబడగలవు. వస్తు వాహన గృహ మరమ్మత్తులు జరుగగలవు. ఆత్మీయులకు బంధువర్గానికి అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగులు వ్యాపారులకు ప్రభుత్వ పరంగా ఇబ్బందులుండగలవు.

## వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తివ్యాపారాలలో ఆదాయం సంతృప్తికరం. ఆర్థికాభివృద్ధి అవకాశాలు దొరుకుతాయి. బంధుమిత్రులు మీకు అవకాశాలిచ్చి ఆర్థికంగా తోడ్పడుతారు. ఉద్యోగప్రయత్నాలు చేసే వారికి అవకాశాలు దొరుకుతాయి. ప్రభుత్వ అనుమతులు లభించవచ్చును. గృహనిర్మాణాలు, మరమ్మత్తులు నిదానంగా సాగుతాయి. అనుకున్న పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది.

## ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వ్యాపారవర్గాలకు, వృత్తిరంగాల వారికి ఆర్థిక అవకాశాలు చేజారిపోవచ్చును. ఈ రాశి వారికి ఆదాయం సామాన్యం. కుటుంబ అవసరాల ఖర్చులు, వైద్య ఖర్చులు పెరుగుతాయి. ఆస్తి, ఆర్థిక లావాదేవీలు వేచివుంటాయి. కుటుంబసభ్యులకు, బంధువర్గానికి అనారోగ్య బాధలుంటాయి. కోర్టుకేసులలో అనుకూలత ఉండదు. సహాయ పడవలసిన వారు ముఖం చాటేస్తారు.

## మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అవిశ్రాంత కృషిచేస్తారు. ఆదాయం పెరుగుతుంది. క్రయవిక్రయాలలో తొందర పాటు తగ్గించుకోవాలి. రావలసిన బాకీలు వాయిదా పడగలవు. ముఖ్య విషయాలలో పెద్దల సూచనలు తీసుకొంటే మంచిది. ఉద్యోగులకు, అధికారులకు అదనపు బాధ్యతలుంటాయి. అయినా విధి నిర్వహణ సమర్థవంతంగా నిర్వహిస్తారు. నిరుద్యోగులకు అవకాశాలు లభించగలవు.

## కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక వ్యవహారాలలోను, కుటుంబవ్యవహారాలలో కఠిననిర్ణయాలు తీసుకొంటారు. ఏదో ఒక విషయంలో మీపై విమర్శలు వస్తాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలుండి, నిర్వహణ సాఫీగా సాగిపోతుంది. బంధు మిత్రులతో మంచికాలక్షేపం, కోర్టు వ్యవహారాలలో కొంత అనుకూలత ఉంటుంది. భూ, ఆస్తి సమస్యలు పరిష్కారానికి వస్తాయి. రాజకీయవర్గాలకు అనుకూలత బాగుంది.

## మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

బంధువర్గానికి మిత్రులకు సహాయపడతారు. వృత్తివ్యాపారాలు, ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. అనుకోని అవసరాలకు కొద్ది ఋణం చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో భిన్నాభిప్రాయాలు బోటు చేసుకొంటాయి. పిల్లలు, పిల్లల పెళ్ళిళ్ళు జరుపుతారు. దూరప్రయాణాలు నిర్ణయంకాగలవు. వివాహాదిశుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. చేపట్టిన పనులు సక్రమంగా జరుగుతాయి.

# మాశిలామణికి కోపం వచ్చింది

## మహిళా వైద్యులపై వేటుపడింది

ఇద్దరు మహిళా వైద్యులు, ఇద్దరు ఏఎన్ఎంలు, ఒక ఫార్మసిస్టును జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాశిలామణి సస్పెండ్‌చేశారు. సంఘటన వివరాలలోకి వెళ్తే- డా॥మాశిలామణి తనదైన ఆకస్మిక తనిఖీలలో భాగంగా 14వ తేదీ మండల కేంద్రమైన ఓజిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి మధ్యాహ్నం మూడుగంటల సమయానికి చేరుకున్నారు. కేంద్రంలో స్టాఫ్‌నర్స్ మమత, సిహెచ్‌ఓ వెంకటరమణ మాత్రమే ఉన్నారు. ఇద్దరు మహిళావైద్యులు డా॥ స్వప్న, డా॥విజితలతోపాటు ఏఎన్ఎమ్‌లు నాగలక్ష్మి, రమణమ్మ, మరో మహిళా ఫార్మసిస్టులు గైర్హాజరు. ఆయన తనిఖీలో తెలిసిన మరో విషయం ఏమిటంటే ఆసుపత్రి నిధులు, మందులు వినియోగించాల్సిన వారికి వినియోగపడకుండా ప్రక్కదారి వెంట స్వాహా అవుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఈ విషయంపై ఫైర్ అయి, విధుల్లోలేని డాక్టర్లను, సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నట్లు ఓజిలిలోనే విలేకరులకు చెప్పి వచ్చేశాడు. ప్రధానమైన వైద్య రంగం ఎంత భ్రష్టు పట్టిందనేదానికి ఇదొక చిరు ఉదాహరణ మాత్రమే. జిల్లావ్యాప్తంగా చాలా పిహెచ్‌సిల విషయం ఇలాగే వుంది. వైద్యశాలలో విధులు నిర్వహించాల్సిన పెద్దాసుపత్రి డాక్టర్లకు క్వార్టర్లు కూడా వున్నాయి. కానీ అక్కడో మంచం దుప్పటి దిండు మాత్రమే వుంటాయి. పిహెచ్‌సిలలో అయితే దాదాపు 90శాతం మంది స్థానికంగా ఉండేవారే లేరు. అందరూ జిల్లా కేంద్రంలోనో, డివిజన్ కేంద్రాలలోనో కాపురముంటారు. అంతేకాకుండా ప్రైవేటు ప్రాక్టీసులు చేసుకుంటూ వుంటారు. ప్రైవేటు ప్రాక్టీసులు చేసుకుంటే మునిగిపోయేదేమీ లేదుకానీ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో అవసరమయినపుడన్నా విధులు నిర్వహిస్తే బాగుంటుంది.

ఈ విషయాలన్నీ జిల్లా ఉన్నతాధికారులకు, పిహెచ్‌సీలను పర్యవేక్షించే క్లస్టర్ అధికారులకూ అందరికీ తెలిసిందే. ప్రస్తుతం సస్పెండ్ అయినవారు కూడా ఏమీ ఆదుర్దాపడరు. ఎవరో ఒక రాజకీయ నాయకుని ప్రాపకంతోనో, లేకుంటే మరో దొడ్డిదోవనో వాళ్లు మరో చోట పోస్టింగ్ సంపాదించుకుంటారు. అంతే.

# వీధుల్లో చిందరవందరగా విద్యుత్ తీగలు

విద్యుత్‌లేనిదే మనిషి జీవనం క్షణం కూడా దుర్భరమే. ఆ విద్యుత్‌ను రకరకాల వనరుల ద్వారా ఉత్పత్తిచేసి ఉపయోగించుకోవడం జరుగుతోంది. అయితే నెల్లూరులో ఇళ్లల్లో వినియోగించే విద్యుత్ సరఫరా అయ్యే కరెంటుతీగల తీరు చూస్తే మాత్రం అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. నెల్లూరులోని వీధులు కొన్ని దగ్గర ఇరుకిరుకుగా వుండడం తెలిసిందే. ఆ వీధుల్లో తలెత్తి పైకి చూస్తే భయమేస్తుంది. కారణం విద్యుత్‌తీగలు కీకారణ్యాన్ని తలపిస్తాయి. వీధికి అటు, ఇటు వుండే ఇళ్లల్లోని వారికి అది ఎంత ప్రమాదాన్ని కలిగిస్తాయో వూహించడానికే భయం కలిగిస్తుంది. ఏ మాత్రం ఏమరపాటుగా వున్నా, ఏ తీగన్నా తెగిపడినా ప్రాణాపాయమే కదా. ఇటీవల అదే జరిగింది. గాంధీబొమ్మ దగ్గర నుంచి జిల్లా కలెక్టర్ ఆఫీసుకు వెళ్ళే దారైన రాయాజీవీధి మొదట్లోని ఓ మిద్దెపైన ఫ్లెక్సీని తొలగిస్తూ విద్యుత్ తీగ తెగడంతో విద్యుత్‌ఘాతానికి గురయి ఇద్దరు యువకులు మరణించారు. ఇది మచ్చుకు చెప్పుకునే సంఘటన మాత్రమే. చిన్నబజారులోని గిడ్డంగివీధి, కామాటివీధి, సవరాలవీధి, మండపాల వీధి మరసర వీధుల్లో విద్యుత్‌తీగలు, కేబుల్‌తీగలు, టెలిఫోన్‌తీగలు ఒకదాంట్లో ఒకటి చుట్టుకుపోయి చిందరవందరగా పెను ప్రమాదానికి చిరునామాగా కనిపిస్తుంటాయి. విద్యుత్‌శాఖ వీటిపట్ల ఏ మాత్రం జాగ్రత్త వహించిన దాఖలా కనిపించడంలేదు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకునేటట్లు కాకుండా ఇప్పటికైనా తత్సంబంధిత అధికారులు తగుచర్యలు తీసుకుని వాటిని సంస్కరిస్తే మంచిది.


# పెళ్ళి సంబంధాలు

వధువు కావలెను — వరుడు కావలెను

1. 1984, 1 జననం. ఎత్తు 6'1". చదువు బి.ఇ. ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఒరాకల్, బెంగుళూరు. జీతం నెలకు 50,000/-. ఆస్తి విలువ 5కోట్లు. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం చిత్తూరుజిల్లా. ప్రస్తుతనివాసం బెంగుళూరు.
2. 1981 ఆగష్టు 8 జననం. ఎత్తు 5'9". చదువు యం.బిఏ. వృత్తి వ్యాపారం. ఆస్తివిలువ 30కోట్లు. ఉన్నతమైన రెడ్డివ్యాపార కుటుంబం. స్వస్థలం అనంతపూర్‌జిల్లా.
3. 1982 సెప్టెంబరు 5వ తేదీ జననం. ఎత్తు 6". చదువు బి.కాం, యల్.యల్.బి. యం.బి.ఏ. వృత్తి కాంట్రాక్టులు. ఆస్తి విలువ 15కోట్లు. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగ కుటుంబం. స్వస్థలం చిత్తూరుజిల్లా. ప్రస్తుతనివాసం బెంగుళూరు.
4. 1980 మార్చి 21 జననం. ఎత్తు 5'9 1/2". చదువు యం.డి., యం.బి.ఏ(సులెడిస్లియా) అమెరికా. ఆస్తివిలువ 10కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపార కుటుంబం. ప్రస్తుత నివాసం బెంగుళూరు.
5. 1980 జూన్ 19 జననం. ఎత్తు 5'10". చదువు అండర్ గ్రాడ్యుయేట్ (యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ డల్లాస్ (అమెరికా). వ్యాపారం కాంట్రాక్టులు. ఆస్తివిలువ 35కోట్లు. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం నిజామాబాద్‌జిల్లా ప్రస్తుతస్థిరనివాసం హైదరాబాద్.
6. 1983 ఏప్రిల్ 17 జననం. ఎత్తు 5'3". చదువు బి.టెక్(సి.యస్.ఐ.టి). ఉద్యోగం క్యాంప్‌బెల్(సిన్సినాటి బిజినెస్ సొల్యూషన్స్). ఆస్తివాటా 5కోట్లు. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. ప్రస్తుతనివాసం హైదరాబాద్.
7. 1988 అక్టోబరు 2జననం. ఎత్తు 5'6". చదువు బి.టెక్(బయోటెక్) ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, టీసీఎస్ (ఇన్ఫోసిస్). జీతం 30,000/-. ఆస్తివాటా 11/2కోటి. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం మద్రాసు.
8. 1986 డిసెంబరు 1 జననం. ఎత్తు 5'10 1/2". చదువు బి.డి.యస్. ఆస్తివాటా 6కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా ప్రస్తుతనివాసం హైదరాబాద్.
9. 1987 జూలై 14 జననం. ఎత్తు 5'7". చదువు బి.పి.టి. ఆస్తి విలువ 3కోట్లు. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం కడపజిల్లా.
10. 1984 అక్టోబరు 19 జననం. ఎత్తు 5'6". చదువు బి.టెక్(జె.ఎన్.టి.యు) హైదరాబాద్, యం.యస్(జె.ఐ) అమెరికా. ఉద్యోగం సాఫ్ట్‌వేర్ టెస్ట్ ఇంజనీర్ బ్రోకేడ్ కమ్యూనికేషన్స్ సిస్టమ్స్, ఇంక్ కాలిఫోర్నియా(అమెరికా) జీతం 8లక్షలు. ఆస్తివాటా 5కోట్లు. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. ప్రస్తుతనివాసం హైదరాబాద్.

చిరునామా: కొండూరు వారిసారాయణరెడ్డి 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4
98480 34522
94406 39460
పోస్టుబాక్స్ నెం.4, C/O లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక షాపు నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంటలే-ఔట్, నెల్లూరు - 3.

# కదంబం

## కలకలనం

ఏటూరి నాగేంద్రరావు
నెల్లూరు. 7416665323.

ఎంత విశాలంగా ఉన్నా
ఎంతో విలాసంగా నడిచి వెళ్తున్నా
పూసిరంతా యురుకిరుగ్గానే
మట్టూ పీలుస్తున్న సమస్యల సంత
ఎంత నొంటరిగా ఉన్నా
ఎన్నెన్నో స్వర్గాల మధ్య
నిలువునా నలిగిపోతున్న అమరకవ
ఏనాటిదో యుద్ధారా
అన్నీ చిరపరిచిత ముఖాలే!
ఎవర్నీ ఎప్పుడూ పలకరించిన
పొక్క వాఖలా కన్పించదు.
కొక్కోసారి సాధన చేసిన స్వరమే
కొత్తగా గొంతులో నుడితిరుగుతూ
ఎంత ప్రయత్నించినా
రాగాన్ని పలికించదు రస్వంతైనా
శ్రుతి, స్వరం సహకరించుకోవు
అస్పష్టంగా మాటని
మౌనం పెదవుల పైనే ఆడిస్తుంది.
కొక్కొక్కప్పుడు అకారణంగా
గుండె గొంతుకలో యుద్ధుక్కుపోయి
మనసులో లోపలే మరిస్తుంది.
గుండెల్లోని విస్ఫోటనం
గుస్సాలు నివ్వెర మంచు ముద్దగా
మారిపోతుంది!

# పార్లమెంటులో ప్రత్యేక సన్మానాలు

## గల్పిక

అది శ్వేతజాతి తూటాలు తగిలిన భారత ప్రజాస్వామ్య వ్యవస్థలాగే పటిష్ఠంగా ఉన్న పార్లమెంటు భవనం. తొలి సమావేశం జరిగి అరవై ఏళ్లు కావడంతో ఆరోజు సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ ఆవరణలో ఉద్యాన వనంలో సోనియా గాంధీ, ప్రధాని మన్మోహన్ సింగ్ సహా పలువురు సభ్యులు ఆసీనులయ్యారు. సభ్యులకు సన్మానాలు చేస్తున్నారు... [illegible]

టుంటాం... ఇదంతా ఆలోచిస్తున్నా అందరూ ఎరగాగా కలిసి ఆడిపాడుకుందామని ప్రతిపాదించారు. ఆయన మాటకు సభ్యులందరూ హర్షధ్వానాలతో ఆమోదం తెలిపారు. ఏం ఆట ఆడుదామో మీరే చెప్పండని సోనియాగాంధీ అడిగింది... [illegible]

సభ్యులు రిమోట్ లేపింగ్, దేశభక్తి గీతాలు వినిపిస్తుండగా... [illegible] ఇంత పెద్ద పార్లమెంటు ఎన్నడూ చూడలేదని, ఈ సభలో ఇలాంటి సన్మానాలు కొనసాగాలని సభ్యులు అభిప్రాయపడ్డారు... [illegible] పార్లమెంటు వ్యవస్థ ఎంత గొప్పదో ప్రపంచానికి చాటి చెప్పారు... [illegible] వచ్చేటట్లు చెప్పేసి వేగంగా వెళ్లిపోయారు.

# గూడూరు వార్తలు

## రక్తదానం ప్రాణదానమే



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు

రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడాలని గూడూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ కోరారు. ఆదివారం గూడూరు నెల్‌క్యాస్ట్ ఫెర్రో అల్లాయ్స్ ఆధ్వర్యంలో కంపెనీ ఆవరణలో ఉద్యోగులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం అక్కడ పనిచేస్తున్న కార్మికులు రక్తదానం చేశారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ డివిజన్ కేంద్రమైన గూడూరు ప్రధాన ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి జాతీయ రహదారి పక్కనే ఉండటంతో పలువురు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి నిత్యం ఆసుపత్రికి వస్తుంటారని, అటువంటి వారికి ప్రజలు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వాసుగౌడ్ మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో పలుసేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఫ్యాక్టరీలోని ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చంద్రప్రకాశ్, సి.రోహిణి, అశోక్‌కుమార్, లలితాదేవి, శిరీషలతో పాటు నెల్‌క్యాస్ట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ ఫైనాన్స్ దుప్పూరు రవీంద్రనాథ్‌రెడ్డి, కంపెనీ పి.ఆర్.ఓ. ఎ.శివకుమార్, రోటరీ సభ్యులు శ్రీనివాసగౌడ్, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, నాగులు, చాంద్‌పాషా, సురేంద్ర బాబు, సుబ్బయ్యశెట్టి, బుజ్జిబాబురెడ్డి, పార్థసారథి, ఇంజనీర్ సునీల్‌కుమార్, బలరామిరెడ్డి పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వెంకటగిరి పురపాలక సంఘంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం పారిశుద్ధ్య కార్మికులు గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా వెంకటగిరి పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పిఎఫ్ ఇవ్వాలని, సబ్బులు, యూనిఫామ్, ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయమై పలుమార్లు ఆందోళనలు చేసినా తమకు న్యాయం జరగలేదని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో మీరైనా జోక్యం చేసుకొని కార్మికులకు న్యాయం చేయాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు వర్థిపల్లి చెంగయ్య, పట్టణ సిపిఐ కార్యదర్శి ఎ.కేశవులు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

గూడూరులో నారాయణమ్మ వీధిలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉండటంతో సోమవారం ఒకటవ పట్టణ ఎస్సై షఫీ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ స్వయంగా చేపట్టారు. ఆరోజు ఇష్టారాజ్యంగా వాహనాలు నిలపడంతో పాటు గూడూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య జటిలమవుతుందని దీనిపై తాము ప్రత్యేక దృష్టిసారించినా తాము చెప్పినంతసేపు వారు బాగా నడుచుకుంటున్నారని, తిరిగి వారి ప్రవర్తనలో మార్పు రాకపోవడం వలన ట్రాఫిక్ పెద్ద సమస్యగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడం వలనే పలు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. దీనిపై తాము త్వరలో ఒక అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల వివరాలను వెల్లడిస్తున్న పాలకమండలి సభ్యులు

గూడూరు రాజావీధిలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 30వ తేదీ నుండి జూన్ 9 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయపాలక మండలి తెలిపింది. ఆదివారం వారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో పాలకమండలి ఛైర్మన్ శ్రీకంఠి రామమోహన్‌రావు, ఆలయ ఇవో ప్రభాకర్‌లు మాట్లాడుతూ భక్తుల కోర్కెలుతీర్చే శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఈసారి అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. 30న అంకురార్పణలు బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయని, ఇందులో ప్రధానంగా జూన్ 3వ తేదీన హనుమంతసేవ, 4న గరుడసేవ, 6న కల్యాణం, 9న ఏకాంతసేవ, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రతిరోజు సాయంత్రం స్వామివారికి సహస్ర దీపాలంకరణ, ఊంజల్‌సేవ, సాంస్కృతికకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారికి ఓ భక్తుడు 7లక్షల రూపాయల విలువచేసే వెండిమకరతోరణం చేయించి కానుకగా సమర్పించారు. సమావేశంలో ట్రస్టుబోర్డు సభ్యులు వెంకట సుబ్బయ్య, వి.సుబ్బయ్య, బాలయ్య, పశుపతి తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# కాంగ్రెస్‌పార్టీది ఎప్పుడూ సరైన నిర్ణయమే

**గీతారెడ్డి**



అన్నీ ఆలోచించి, అందరితో చర్చించిన పిమ్మటే కాంగ్రెస్‌పార్టీ ఏదైనా నిర్ణయం తీసుకుంటుందని, ఆ నిర్ణయం ఎప్పుడూ సరైనదిగానే వుంటుందని అన్నారు. రాష్ట్ర భారీ పరిశ్రమశాఖామంత్రిణి శ్రీమతి గీతారెడ్డి, కావలి పట్టణంలో శ్రీమతి మాగుంట పార్వతమ్మ నివాసంలో ఆమె 13వతేదీన విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అజాతశత్రువుగా పేరున్న తిక్కవరపు సుబ్బరామిరెడ్డిని నెల్లూరు పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపికచేస్తూ అధిష్టానం తీసుకున్న నిర్ణయం చాలా సమంజసమైన, సరైనదని ఆమె అన్నారు. ఇప్పటి వరకూ టీయస్ఆర్ విశాఖను రాజకీయాలకు వేదికగా ఏర్పాటుచేసుకొని ఎంతో అభివృద్ధి పరచారని, ప్రస్తుతం నెల్లూరు ప్రజలకు సేవచేసే అవకాశాన్ని అపురూపంగా భావించారని ఆమె పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగింది ఒక్క కాంగ్రెస్ పాలనలోనే అని ఆమె స్పష్టంచేశారు. కావలిలో తన వ్యక్తిగత కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె, శ్రీమతి మాగుంట పార్వతమ్మ నివాసంలో బసచేశారు. ఉపఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ నేతలు చేపట్టున్న చర్యలపై ఆమె సమీక్షించిన అనంతరం పనిలోపనిగా విలేకరులతో కూడా మాట్లాడారు. మంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, పనబాక కృష్ణయ్య, మదన్‌గోపాల్, యానాదిశెట్టి, తిరివీధి ప్రసాద్, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

# గీత దాటితే వాతే!




సమీక్షాసమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, పక్కన అదనపుజేసీ లక్ష్మీకాంతం

ఉపఎన్నికలలో ఎవరు నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ హెచ్చరించారు. 14వ తేదీ నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీహాల్‌లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఉపఎన్నికలలో డబ్బు, మద్యం పంపిణీ నియంత్రణపై ప్రత్యేకదృష్టి పెడుతున్నామన్నారు. ఓటర్లకు డబ్బు, మద్యం ఇవ్వడం ఎంత నేరమో, తీసుకోవడం కూడా అంతే నేరమని, ఇచ్చినోళ్లమీద, తీసుకున్నోళ్లమీద కూడా కేసులు పెట్టాల్సివస్తుందన్నారు. డబ్బు, మద్యం నియంత్రణకు కళాజాతాలతో ప్రదర్శనలు, ప్రత్యేక ప్రచారకార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. నెల్లూరు, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు పట్టణాలలో మేధావులు, విద్యార్థులతో కలిసి సక్రమంగా ఓటు హక్కు వినియోగించుకునే దానిపై అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పత్రికలు పెయిడ్ ఆర్టికల్స్‌ను ప్రచురించినట్లయితే అభ్యర్థుల వ్యయం ఖాతాలో ఆ ఖర్చును జమచేస్తామన్నారు. అభ్యర్థులు పత్రికలలో ఇచ్చే ప్రకటనలకు ముందుగానే అనుమతి తీసుకోవాల్సి వుంటుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక నిబంధనలు పక్కాగా అమలులో వుంటాయని ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, జిల్లా పౌరసంబంధ అధికారి కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దళిత పక్షపాతి

**పనబాక కృష్ణయ్య**



స్వతంత్రం వచ్చిన తర్వాత, రాక ముందు నుంచి కూడా కాంగ్రెస్‌పార్టీ బడుగు, బలహీన, దళితవర్గాల ప్రజల అభ్యున్నతికోసం కృషిచేస్తూనే వుందన్నారు కాంగ్రెస్ నాయకుడు, కావలి నియోజకవర్గ ఎన్నికల ప్రచార బాధ్యుడు పనబాక కృష్ణయ్య. కాంగ్రెస్‌పార్టీ విజయంకోసం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ఆయన కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి తిక్కవరపు సుబ్బరామిరెడ్డి విజయం కోసం ప్రచార సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. అట్టడుగు స్థాయిలో వున్న దళిత బలహీనవర్గాల ప్రజలకోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, చక్కగా అమలుచేస్తూ, వారి జీవితాలలో వెలుగులు నింపింది దివంగతనేత మహానాయకురాలు శ్రీమతి ఇందిరాగాంధేనని ఆయన అన్నారు. దళితపక్షాల పక్షపాతిగా కాంగ్రెస్‌పార్టీకి చరిత్ర ఎంతో ఉందని ఆయన వివరించారు. కాంగ్రెస్‌పార్టీ విజయంలో ప్రతిసారీ దళితులపాత్రే ప్రధానపాత్ర వహిస్తుందని, అందుకే నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో గల దళితులందరితో కలిసి మాట్లాడుతున్నామన్నారు. జాతీయస్థాయిలో తనకంటూ ఒక ప్రత్యేకతను కలిగిన వ్యక్తి సుబ్బరామిరెడ్డి అని, ఆయనను గెలిపించుకోవటం ద్వారా జిల్లా అన్ని రంగాలలో ముందుకుపోతుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

## కాంగ్రెస్ టు వై.యస్.ఆర్ - దేశం టు కాంగ్రెస్

# "వరసపెట్టిన వలసలు"



ప్రతిసారీ ఎన్నికల సీజన్‌లో మనకు కనిపించే వలస కార్యక్రమాలు ఈ ఉప ఎన్నికల కాలంలో కాస్త ఎక్కువగానే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పేరిట జగన్‌రెడ్డి స్థాపించిన పార్టీ కాంగ్రెస్‌ను ఖాళీ చేస్తుండడంతో నెల్లూరు జిల్లాలో సుబ్బరామిరెడ్డి అభ్యర్థిత్వం "దేశం పార్టీని" దివాలా తీయిస్తుంది. వినపడుతున్న తరుణంలో తెలుగుదేశం, బిజెపిలతో పాటు ఇతర పార్టీలలో వున్న అన్ని వర్గాల వారికి వలవేసే ప్రయత్నంలో కాంగ్రెస్‌పార్టీ పావులు కదుపుతోందని సమాచారం.

ఇప్పుడిక ప్రజలవద్ద పూర్తిగా విశ్వాసం కోల్పోయిన చంద్రబాబు పార్టీకి ఓటేసినా, అది వృధాగా పోతుంది కాబట్టి కాంగ్రెస్‌కి


### ఓట్లే మూలం - కాంగ్రెస్ గాలం

ఎక్కువశాతం కాంగ్రెస్ కార్యకర్తలు జగన్ వైపు మొగ్గు చూపిస్తుండడంతో సుబ్బరామిరెడ్డి తెలుగుతమ్ముళ్లకు గాలం వేస్తున్నారు. పోటీ కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ మధ్య అని గట్టిగా నమ్ముతున్న తెలుగు తమ్ముళ్లు సైతం టి.యస్.ఆర్. వైపు దృష్టిసారిస్తున్నట్లు సమాచారం.

డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి రుణం తీర్చుకునే క్రమంలో ఓటర్లంతా జగన్‌కు జై అంటున్నారన్న మాట ఎక్కడ చూసినా ఓటేసి సుబ్బరామిరెడ్డిని గెలిపిస్తే అటు కేంద్రంలోను ఇటు రాష్ట్రంలోను పార్టీ అధికారంలో వుంది కాబట్టి జిల్లాను శోభాయమానంగా తీర్చిదిద్దే అవకాశాలు వుంటాయనే పాజిటివ్ సంకేతాలను ప్రజల్లోకి పంపే ప్రయత్నాన్ని కాంగ్రెస్ మొదలుపెట్టింది. ఇప్పుడు వై.యస్.ఆర్. కాంగ్రెస్‌కి ఓటేసినా జగన్ ముఖ్యమంత్రి కాలేడు కాబట్టి ఈసారి లోక్‌సభకు సుబ్బరామిరెడ్డికి వేయండని ప్రచారం చేస్తూ వలసల పరంపరని కొనసాగిస్తున్నారు. మొన్నటి వరకు అన్ని పార్టీల నుండి జగన్‌రెడ్డి పార్టీలోకి వెళ్ళిన వారినే ఎక్కువ శాతం చూసిన జిల్లా ప్రజలు ఇప్పుడు ఇతర పార్టీల నుండి కాంగ్రెస్‌పార్టీలోకి వలస వస్తున్న వారిని చూసి కాంగ్రెస్‌కు జిల్లాలో కొంచెం మంచికాలం వస్తున్నట్లుందని అనుకోవడం వినిపిస్తోంది. ఎన్నికకు ఇంకా 25రోజులుంది, ఈలోగా ఎన్ని వలస పక్షులు ఏగూటి నుండి ఏ చోటకి చేరుతాయో జిల్లా రాజకీయ తెరపై వేచిచూద్దాం.

## బాబు పర్యటనతో...

# ఉదయగిరి దేశంలో ఉత్సాహం





ఈ నెల 12వ తేదీన ఉదయగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు జరిపిన ఎన్నికల ప్రచారం ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశం శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నింపింది. ఉదయగిరి నియోజకవర్గ స్వరూపమే కాదు, అక్కడి రాజకీయాలు కూడా చాలామారాయి. 1985 నుండి కూడా తెలుగుదేశం పార్టీకి ఇక్కడ ఏకైక నాయకుడిగా చలామణిలో వున్న కంభం విజయరామిరెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఇక్కడ 'దేశం' కేడర్ కొంత డీలా పడింది. అయితే అదే సమయంలో భారీగా కుల సమీకరణలు మారాయి. 1985లో ఉదయగిరి తెలుగుదేశం టిక్కెట్‌ను కమ్మసామాజిక వర్గానికి చెందిన ధనింకుల నరసింహంకు ఇచ్చారు. ఆ తర్వాత 1989, 94, 99, 2004, 2009... ఎన్నికలలో వరుసగా కంభం విజయరామిరెడ్డే తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసారు. ఈ దశలో తెలుగుదేశంకు బలమైన ఓటుబ్యాంకుగా వున్న కమ్మ సామాజికవర్గంలో కొంత చీలిక లొచ్చాయి. ఈ చీలికలే కంభం విజయరామిరెడ్డి వరుస ఓటములకు కారణమయ్యాయి. 5 సాధారణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఉదయగిరికి జరుగుతున్న ఉప ఎన్నికలలో తెలుగుదేశం అభ్యర్థిగా కమ్మ సామాజికవర్గానికి చెందిన బొల్లినేని రామారావు పోటీచేస్తున్నాడు. దీంతో ఆ వర్గీయులలో ఎనలేని ఉత్సాహం వచ్చింది. చంద్రబాబు ఉదయగిరి పర్యటనలో ఆ ఉత్సాహం అడుగడుగునా కనిపించింది.

11వ తేదీ రాత్రికి కందుకూరులో పర్యటన ముగించి దుత్తలూరు మండలం నర్రవాడకు చేరుకున్నాడాయన. అక్కడే బసచేసాడు. 12వ తేదీ ఉదయం నర్రవాడలోని శ్రీ వెంగమాంబ దేవస్థానాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అక్కడికి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. మధ్యాహ్నాం తర్వాత నర్రవాడ నుండి వరికుంటపాడు బయలుదేరి వెళ్లారు. వరికుంటపాడులో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం దుత్తలూరుకు చేరుకున్నారు. దుత్తలూరు నుండి వింజమూరు చేరుకుని పాతబస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించారు.

చంద్రబాబు తన ప్రసంగంలో జగన్ అవినీతిని ప్రధానంగా ప్రస్తావించారు. నెల్లూరులో గాయత్రి, డిఏంసి అనే రెండు కంపెనీలు ఎన్నికల్లో నిలబడ్డాయని, ఆ రెండు వ్యాపారసంస్థలకు ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. నెల్లూరు పార్లమెంట్ నుండి వంటేరు వేణుగోపాలరెడ్డిని, ఉదయగిరి అసెంబ్లీ నుండి బొల్లినేని రామారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చంద్రబాబు కోరారు.

# మేకపాటి జిల్లాకు చేసిందేమీలేదు

**పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి**



కాంగ్రెస్ మండలనాయకుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి అధ్యక్షతన కొడవలూరు మండలం గుండాలమ్మపాళెంలో కాంగ్రెస్‌పార్టీ సమావేశం 14వ తేదీ జరిగింది. ముఖ్యఅతిథిగా కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొని మాట్లాడారు. మేకపాటి రాజమ్మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీ నుంచి మూడుసార్లు పార్లమెంటు సభ్యుడిగా గెలిచి నెల్లూరు జిల్లాకు చేసిందేమీలేదని విమర్శించారు. మన జిల్లా వ్యక్తి సుబ్బరామిరెడ్డిని కాంగ్రెస్ అధినేత్రి శ్రీమతి సోనియాగాంధీ స్వయంగా నెల్లూరులో పోటీచేయమని ఆదేశించారని ఆయన వివరించారు. జాతీయస్థాయిలో భారీ పరిచయాలున్న టి.యస్.ఆర్‌ను గెలిపించి జిల్లాను అభివృద్ధిపరచుకుంటామని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# నెల్లూరులో మరో అధునాతన సినిమాలయం

# "రైన్ సినిమా"



## • ప్రారంభోత్సవానికి సిద్ధం


RAIN CINEMA
Life is Colorful

"కామాక్షి" థియేటర్‌గా నెల్లూరు దర్గామిట్ట ప్రాంతంలో దాదాపు రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమై, ఆ తరువాత నెల్లూరు రాధాకృష్ణారెడ్డి సారధ్యంలో ఎన్నార్ విలాస్‌గా అవతరించి వెంకటరమణ, ఇందిర, పద్మావతి, సెవన్‌హిల్స్ సినిమాహాళ్ల నిలయంగా నెల్లూరీయులకు సేవలందించిన ప్రాంగణం, ఇప్పుడు 'రైన్ సినిమా'గా అత్యాధునిక హంగులతో నెల్లూరీయులకు అందుబాటులోకి రానుంది.

"రెయిన్ సినిమా" 'లైఫ్ ఈజ్ కలర్‌ఫుల్' అనే నినాదంతో ప్రస్తుతానికి ఒక్క థియేటర్‌ని నెల్లూరుజిల్లా సినీప్రియులకు అందించబోతున్నాడు రాధాకృష్ణారెడ్డి. ఈ రెయిన్ సినిమాలో నేడు అందుబాటులో వున్న అన్ని అధునాతన సదుపాయాలను సమకూర్చారు. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా అత్యంత సౌకర్యవంతంగా వినూత్న సాంకేతికపరిజ్ఞానంతో ఈ సినిమాహాలు అందుబాటులోకి రానుంది. టిక్కెట్ బుకింగ్ కౌంటర్స్ దగ్గరనుండీ సీటింగ్, పార్కింగ్, క్యాంటీన్‌లతో సహా టాయిలెట్స్ వరకు అన్నింటినీ ఆధునికీకరించి త్వరలో సినీ అభిమానులకు ఈ థియేటర్‌ని అంకితం చేయబోతున్నారు. కేవలం వ్యాపార దృక్పధంతో చూడకుండా భారీఖర్చుకు సైతం వెనుకాడకుండా ప్రేక్షకులకు మంచిసౌకర్యాలను కల్పించాలనే సంకల్పంతో ఈ మార్పులు చేపట్టిన నెల్లూరు రాధాకృష్ణారెడ్డి అభినందనీయుడు.

# తలంబ్రాలు చిత్ర నిర్మాణం

ఇదీ నా కథ - 50
(1924 - 2011)




అదే ప్రకారం కేశవరావు, చిత్రం నిర్మాణంలో వుండగా దఫాలవారీగా పన్నెండు లక్షల రూపాయలిచ్చాడు. సంగీత దర్శకుడు సత్యం, నేను, రాజశ్రీ చెరి మూడు పాటలు రాశాం. చిత్రం పేరు 'తలంబ్రాలు'. రాజశేఖర్, జీవిత, కళ్యాణచక్రవర్తి ముఖ్య తారాగణం. దర్శకుడు కోడి రామకృష్ణ. పిక్చర్‌ను ఎలాగైనా హిట్ చేయాలన్న పట్టుదలతో దర్శక నిర్మాతలిద్దరూ ఏకధాటిగా రాత్రిం బవళ్లు శ్రమించి ఇరవైయేడు రోజుల్లో ఒక్క పాట తప్ప మిగతా పిక్చర్ పూర్తి చేశారు. ఆ పాట రికార్డింగ్ జెమిని స్టూడియోలో ఏర్పాటు చేశాం. అది సుశీలగారు పాడవలసిన పాట.

సత్యం ఉదయం 7గంటలకే స్టూడియోకు వచ్చి పది గంటలకు ఆర్కెస్ట్రాను సిద్ధం చేశాడు. సుశీలగారు రావడం అరగంట ఆలస్యమైంది. ఈలోగా సత్యం పక్క రూమ్‌లోకి వెళ్ళి పీకలదాకా తాగి థియేటర్‌లోకి వచ్చాడు. ఇంతలో సుశీల గారొచ్చారు. ఆమె థియేటర్లో అడుగుపెట్టగానే తాగిన మైకంలో వున్న సత్యం నీకోసం ఎంతసేపని ఎదురుచూడాలి అంటూ పచ్చిబూతులు తిట్టాడు.

సుశీలగారు దుఃఖం ఆపుకోలేక రెడ్డిగారూ! అరగంట ఆలస్యంగా వచ్చినందుకు ఇంత మంది ముందు సత్యం ఎంత నీచంగా మాట్లాడాడో విన్నారుగా! నేనికమీద అతని పిక్చర్లో పాడను. దయచేసి మరోలా అనుకోకండి అంటూ తిరిగి వెళ్లబోయింది. థియేటర్లో వున్న జనమంతా సత్యం ప్రవర్తనను అసహ్యించుకున్నారు.

నేను సుశీలగారిని ఆపి చూడమ్మా! పిక్చర్ నాది. నేనింత వరకు నీ పాట లేకుండా ఏ పిక్చర్ తీయలేదు. వాడెంత హద్దు మీరి ప్రవర్తించాడో నాకు తెలుసు అంటూ తలకెక్కిన సత్యం కైపును అరికాళ్లలోకి దిగేదాకా చెంపదరగొట్టి సుశీలగారికి క్షమాపణ చెప్పించాను. తర్వాత సుశీలగారు బాధతోనే మైకు ముందుకు వెళ్ళారు. అది సన్నివేశపరంగా దుఃఖంతో పాడవలసిన పాట. ఆమె అలాగే....

*'ఇది పాట కానే కాదు ఏ రాగం నాకు రాదు*
*వేదన శ్రుతిగా రోదన లయగా సాగే గానమిది'*

అన్న పాటను ప్రేక్షకులు కంటతడి పెట్టేలా పాడింది. ఎన్ని అవాంతరాలెదురైనా అనుకున్నది సాధించాలన్న పట్టుదల మా అబ్బాయికి వారసత్వంగా అబ్బింది. ఆ పట్టుదలతో పన్నెండు లక్షల ముప్ఫైవేల రూపాయల ఖర్చుతో చిత్రం పూర్తి చేశాడు.

తొలి కాపీరాగానే ముందుగా వాళ్లమ్మకు చూపించాడు శ్యామ్. అమె ఇంటికి రాగానే పిక్చర్ చాలా బాగుంది. కొత్తగా కూడా వుంది. కాని 'తలంబ్రాలు' అన్న పేరు చిత్రంలో ఎక్కడా వినిపించదని చెప్పింది. వెంటనే ఫస్ట్ రీలు తెప్పించి సత్యం, నేను జెమినిలో ఆ రీలు చూశాం. సత్యం అమ్మగారు చెప్పింది నిజమే సార్! మీరు టైటిల్‌కనుగుణంగా చిన్న పాట రాయండి అన్నాడు.

నేను 'బుల్లి పాప కోరేది తల్లిపాలు కన్న పిల్ల కోరేది తలంబ్రాలు' అన్న పల్లవితో ఒక మినీ సాంగ్ రాశాను. ఆ పాట పూర్తయ్యే సరికి ప్రేక్షకుడు కథలో లీనమౌతాడు.

మర్నాడు మయూరి ఫిలిమ్స్ మేనేజర్ కేశవరావు ఫోన్ చేసి తలంబ్రాలు ఒకసారి చూద్దాం సార్ అన్నాడు. నేను ప్రదర్శన ఏర్పాటు చేశాను. కేశవరావు, అతని అసిస్టెంటు, నేను, సుభాను, మా బావమరిది రమణారెడ్డి, మా అబ్బాయి కలిసి పిక్చర్ చూసాం. పిక్చర్ చూస్తున్నంత సేపు నేను అనూహ్యమైన ఆనందానుభూతికి లోనయ్యాను. ఇలాంటి పిక్చర్ ఒక్కటి కూడా తీయలేకపోయానే అని బాధపడ్డాను. ప్రదర్శన పూర్తయ్యాక అందరం బైటకొచ్చాం. పిక్చర్‌ను గురించి నేనేమంటానో, కేశవరావేమంటాడోనని మా అబ్బాయి భయపడుతూ నిల్చున్నాడు.

నేను నీ అభిప్రాయం చెప్పలేదే కేశవరావ్ అన్నాను. అందులో ఏముంది రెడ్డిగారూ చెప్పడానికి అన్నాడతను. దాంతో శ్యామ్ అక్కడ నిలవలేక ఇంటికెళ్ళాడు. వాడలా వెళ్ళగానే నేను కేశవరావ్! పిక్చర్ నీకు బొత్తిగా నచ్చినట్లు లేదు. రేటొస్తే కొన్ని జిల్లాలు అమ్మేయమంటావా! అన్నాను. అతను నా చెయ్యి పట్టుకొని వీలుంటే అన్ని జిల్లాలు అమ్మేయండన్నాడు.

నేను ఇంటికి వెళ్ళగానే పిక్చరెవరికీ నచ్చినట్టులేదు. బాబు దిగులుగా పడుకున్నాడని నా శ్రీమతి చెప్పింది. నేను వాడి రూమ్‌లోకి వెళ్ళి ఇంత పిరికివాడివి పిక్చరెందుకు తీశావ్ రా! ఆ కేశవరావ్ మాట వేదమను కున్నావా! నేను చెప్తున్నా విను. పిక్చర్ సూపర్ హిట్ కావడమే కాకుండా నిర్మాతగా నీకు మంచి గుర్తింపు తెచ్చిపెడుతుంది. లేచి భోంచెయ్ అన్నాను. తలంబ్రాలు 17.10.1986వ తేది విడుదలై ఎంత ఘన విజయం సాధించిందో అందరికీ తెలుసు. ఆ చిత్ర విజయోత్సవం మద్రాసులో అపూర్వంగా జరిపించాం. తలంబ్రాలు చిత్రం ద్వారానే రాజశేఖర్, జీవిత ఆలుమగలయ్యారు.

## ఆహుతి చిత్ర నిర్మాణం

దర్శకుడు కోడి రామకృష్ణ. సంగీతం సత్యం. అందులో కూడా రాజశేఖర్, జీవిత ప్రధాన పాత్రధారులు. చరణ్‌రాజు విలన్‌గా నటించాడు. ప్రసాద్ అనే యువకుణ్ణి కొత్తగా పరిచయం చేశాడు శ్యామ్. తర్వాత అతను పరిశ్రమలో 'ఆహుతి ప్రసాద్'గా నిల్చిపోయాడు. మిగతా యూనిట్ సభ్యులందరూ 'తలంబ్రాలు' చిత్రానికి పని చేసిన వాళ్ళే.

'తలంబ్రాలు' చిత్రం హిట్ కావడంతో కోడి రామకృష్ణ, శ్యామ్‌బాబు కాంబినేషన్‌కు ప్రేక్షకుల్లో క్రేజ్ పెరిగింది. ఆ క్రేజ్‌ను నిలబెట్టుకోవాలన్న

సత్యం సంగీతాన్ని ప్రేమించినంతగా డబ్బును ప్రేమించడు. తెలుగులోనూ, కన్నడంలోనూ వందలాది చిత్రాలకు సంగీతం సమకూర్చినా పెద్దగా సంపాదించుకోలేకపోయాడు. కారణం అతను నిర్మాత వీలును బట్టి పారితోషికం ఎంతిచ్చినా తృప్తిపడతాడు.

పట్టుదలతో ఇద్దరూ కథాకథనం మొదలుకొని ప్రతి విషయంలోనూ ఒకరినొకరు సంప్రదించుకొంటూ చిత్రం పూర్తి చేశారు. 'ఆహుతి' చిత్రంలో పాటలన్నీ నేనే రాశాను. అన్ని పాటలు ప్రజల మన్ననలందుకున్నాయి. చిత్రం 1987 డిసెంబరు మూడున విడుదలై శత దినోత్సవం జరుపుకుంది.

## అంకుశం చిత్ర నిర్మాణం

వరుసగా రెండు చిత్రాలు విజయవంతం కావడంతో హ్యాట్రిక్ సాధించాలన్న పట్టుదల దర్శక, నిర్మాతల్లో మరింత పెరిగింది. ఆ పట్టుదల్లో నుండి ఆవిర్భవించిందే 'అంకుశం'. అందులో కూడా జీవిత, రాజశేఖర్ నాయికానాయకులు. హోం మంత్రిగా చలసాని కృష్ణారావును, విలన్ పాత్రకు రామిరెడ్డిని కొత్తగా ఎన్నిక చేశారు.

చిత్రం ప్రారంభించక ముందు ఒక రోజు కోడి రామకృష్ణ, మా అబ్బాయి నా వద్దకు వచ్చి 'అంకుశం' చిత్రంలో ఒక ముఖ్యమంత్రి పాత్ర వుంది. అది మీరే వేయాలని పట్టుబట్టారు. వెంటనే నేను చూడు రామకృష్ణా! ఈ వయసులో నేను ముఖానికి రంగు పూసుకొని సినిమాలో నటించవలసిన అవసరం లేదని ఖరాఖండిగా చెప్పాను.

రామకృష్ణ, సార్! మీరు మేకప్ వేసుకోవలసిన పనిలేదు. విగ్గు పెట్టుకోవలసిన అవసరం అంతకన్నా లేదు. నిత్యం మీరు ధరించే ఖద్దరు పంచె, లాల్చి చాలు అని నచ్చచెప్ప ప్రయత్నం చేశాడు. ఐనా నాకు నటనలో ఏ మాత్రం అనుభవం లేదు. కృత్రిమంగా నటించడం నాకిష్టంలేదు. నిజజీవితంలో ఎలా వ్యవహరిస్తానో అలాగే నటిస్తాను. అందుకు మీరు సిద్ధమేనా అని అడిగాను. మేం కోరుకునేది అదే సార్ అన్నాడు రామకృష్ణ.

సంగీత దర్శకుడు సత్యం. అందులో కూడా పాటలన్నీ నేనే రాశాను. ముఖ్యమంత్రి ఒక సన్నివేశంలో హోం మంత్రిని కొన్ని గణాంక వివరాలడుగుతాడు. హోంమంత్రి సరైన సమాధానం చెప్పలేక అభాసుపాలవుతాడు. అప్పుడు ముఖ్యమంత్రిగా నేను రాష్ట్రంలోని అన్ని శాఖలకు సంబంధించిన గణాంక వివరాలను అక్షరం పొల్లుపోకుండా ఏకధాటిగా చెప్పాను. అంకుశం 1989 జూన్ 13న విడుదలై కలెక్షన్ పరంగా అంతకు ముందు రికార్డులన్నిటినీ బ్రద్దలుకొట్టింది. ఆ చిత్రం ద్వారా నేను మాజీ కాని ముఖ్యమంత్రిగా ప్రేక్షక హృదయాల్లో నిల్చిపోయాను.

అంకుశం తమిళ రైట్స్ రాజశేఖర్ కొని 'ఇద్దాండా పోలీస్' అన్న పేరుతో అనువదించాడు. ఆ చిత్రం తమిళనాడులో సూపర్ స్టార్ రజనీకాంత్ చిత్రంతో పోటీబడుతూ ఏకధాటిగా నూరురోజులు నడి చింది. ఆ విజయోత్సవ సందర్భంగా రాజశేఖర్ జీవితతో పాటు నన్ను కూడా ఆహ్వానించారు పంపిణీదారులు. ఆ వేడుకలో నన్ను చూసిన తమిళ ప్రేక్షకులు "పుధూ కామరాజ్"గా అభివర్ణిస్తూ నాకు బ్రహ్మరథం పట్టారు.

ఇక్కడొక విషాద వార్త చెప్తాను. సత్యం సంగీతాన్ని ప్రేమించినంతగా డబ్బును ప్రేమించడు. తెలుగులోనూ, కన్నడంలోనూ వందలాది చిత్రాలకు సంగీతం సమకూర్చినా పెద్దగా సంపాదించుకోలేకపోయాడు. కారణం అతను నిర్మాత వీలును బట్టి పారితోషికం ఎంతిచ్చినా తృప్తిపడతాడు. 'అంకుశం' చిత్రంలోని అన్ని పాటలను అత్యంత జనరంజకంగా స్వర పరచిన సత్యం ఇంకా ఎంతో కాలం జీవించవలసిన వాడు. మితిమీరిన తాగుడు వలన చిత్రం విడుదలకు ముందే కన్నుమూశాడు. ఆ కారణంగా 'అంకుశం' చిత్రాన్ని అతనికి అంకితమిచ్చాం.

'అంకుశం' ఇటు తెలుగులోనూ, అటు తమిళంలోనూ ఘన విజయం సాధించాక ఆ చిత్రాన్ని హిందీలో తాను కథానాయకుడుగా రీమేక్ చేయాలన్న ఉద్దేశ్యంతో చిరంజీవి రైట్స్ అడిగాడు. ఇంకా చాలా మంది నిర్మాతలు ఎగబడినా మా అబ్బాయి సలహా మేరకు చిరంజీవికే ఇచ్చాను.

## ఆగ్రహం చిత్ర నిర్మాణం


డైరెక్టర్ కె.రవిచంద్ర, సంగీతం కోటి. ఈనాడు ఆస్కార్ అవార్డుల గ్రహీతగా ప్రపంచ ప్రశంసలందుకుంటున్న ఎ.ఆర్.రెహమాన్ 'ఆగ్రహం' చిత్రానికి కేవలం కీబోర్డు ప్లేయర్‌గా పనిచేశాడు. హీరో రాజశేఖర్, హీరోయిన్ అమల. చిత్రంలో రెండు పాటలే వున్నాయి. ఆ రెండు సిరివెన్నెల, సాహితి రాశారు. చిత్రం విడుదలకు ముందు రాజశేఖర్ చెన్నైలో ఒక ప్రదర్శన ఏర్పాటు చేసి పరిశ్రమలోని పెద్దలకు చూపించాడు. ప్రదర్శన పూర్తికాగానే 'ఇంటింటి రామాయణం' వంటి అనేక విజయవంతమైన చిత్రాలు నిర్మించిన నవతా పిక్చర్స్ అధినేత 'కృష్ణంరాజు' గారు నాకు ఫోన్ చేసి నేనిప్పుడే మీ అబ్బాయి నిర్మించిన 'ఆగ్రహం' చూశాను. అందులో రాజశేఖర్ నటన శిఖరాయమానంగా వుంది. డైలాగ్ డెలివరిలోనూ, అభినయంలోనూ విశ్వరూప సందర్శనం చేసాడు. నిజం చెప్పాలంటే రాజశేఖర్ ముందు అమితాబ్‌బచ్చన్ బలాదూర్ అన్నారు. దక్షిణ భారతదేశంలో కృష్ణంరాజుగారికున్నంత సినిమా నాలెడ్జి మరొకరికి లేదు. అంతటి గొప్ప వ్యక్తి నాబిడ్డ చిత్రాన్ని అంతగా ప్రశంసించడంతో నేను పొంగిపోయాను. 'ఆగ్రహం' రాజశేఖర్‌కెంత పేరు తెచ్చినా పెద్దగా ప్రజాదరణ పొందలేదు.

(ఇంకా వుంది)

PDF Compressor Free Version



నిత్యం వేలకోట్ల రూపాయల వ్యాపార లావాదేవీలతో క్షణం తీరికలేకుండా గడిపే జి.వి.కె. సంస్థల అధినేత జి.వి.కృష్ణారెడ్డి నోట పలికిన అక్షరమూటలు ఈ మాటలు. నేను రాజకీయాలకు దూరం, అన్ని పార్టీలవారు నాకు సన్నిహితులే కాని ఈరోజు పోటీచేస్తున్నది మా కుటుంబసభ్యుడు, సుబ్బరామ్ మా ఇంట్లోనే పుట్టాడు. నాకు మేనత్తకొడుకే కాదు, వియ్యంకుడు కూడా అందుకే మీ ముందుకొచ్చా, ఆయనని ఆశీర్వదించండి అంటూ ఇందుకూరు పేట, కొత్తూరు గ్రామప్రజలను అభ్యర్థించారు.



## మంచిసేవలు అందుకోండి...

# మా "రాముడి"ని దీవించండి

### - కొత్తూరులో జి.వి.కె.

మే12వ తేదీ శనివారం కొత్తూరు గ్రామంలో జి.వి.కె.రెడ్డి ఇంటివద్ద ఏర్పాటు చేసిన ఆత్మీయపరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడాడు. తాను చెప్పే మాటలు గొంతులోనుండి కాదని హృదయంలో నుండి వస్తున్నాయన్నారు. తమ గ్రామ పరిసరప్రాంత ప్రజలకు ఇప్పటికే తాను చాలా సేవలందించానని, భవిష్యత్తులో ఇంకా అందిస్తానని అన్నాడాయన. మంచి విద్య, వైద్యం, త్రాగునీరు లక్ష్యంగా పరిపూర్ణ పరిజ్ఞానం, సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా తన సేవా కార్యక్రమాలను తన జన్మభూమి కోసం అందిస్తానన్నారు. ఇన్నాళ్లకు నెల్లూరుజిల్లాకు వచ్చిన సుబ్బరామిరెడ్డిని బలపరచాల్సిన బాధ్యత అందరిమీదా వుందన్నారు. సుబ్బరామిరెడ్డికి తోడుగా తాను కూడా అందరికీ అన్నీ సమకూర్చడానికి కృషి చేస్తానని వాగ్దానం చేశాడు. జి.వి.కె.రెడ్డి కార్యదక్షుడు. తాను అనుకున్నది సాధించడమేకాకుండా చెప్పిందిచేసే స్వభావమున్న వ్యక్తి. ఆయనకి తోడుగా సుబ్బరామిరెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తామని వాగ్దానం చేయడం అభినందనీయం. ఈ కృష్ణార్జునుల సారధ్యంలో ఇందుకూరుపేట మండలం సస్యశ్యామలం కాబోతోందన్న ఆశ ఇప్పటికే ఆ ప్రాంతవాసుల్లో చిగురించింది.



యువతతో టి.యస్.ఆర్., జి.వి.కె.రెడ్డి



అవ్వలూ... బాగున్నారా అంటూ పలకరిస్తున్న సుబ్బరామిరెడ్డి

# నేను మీ వాడిని... మీలో ఒకడిని

### సుబ్బరామిరెడ్డి



నేను మీ వాడిని, మీలో ఒకడిని, మీ మధ్య జన్మించిన మీ కుటుంబసభ్యుడిని, వృత్తి రీత్యా ఇన్నాళ్లు, ఇన్నేళ్లు విశాఖలో వున్నా, ఇక పూర్తిగా మీమధ్యే వుంటాను. మీవాడిగా వుంటాను, మీ సేవకే అంకితమౌతాను, నన్ను మీలో చేర్చుకోండి అంటూ సుబ్బరామిరెడ్డి అభ్యర్థించడం అందరినీ ఆకట్టుకుంది. గతంకంటే భవిష్యత్ మిన్న అన్న కోణంలో తాను చేయబోయే విషయాన్ని ప్రస్తావించి తనని ఆశీర్వదించమని కోరడం ఇందుకూరుపేట మండల పరిసరప్రాంతాల ప్రజలను ముగ్ధులను చేసింది. ఇప్పటికే జి.వి.కె.రెడ్డి చేసిన, చేస్తున్న అభివృద్ధి ఫలాలను అనందిస్తున్న ఈ ప్రాంత ప్రజలు సుబ్బరామిరెడ్డి రాక సంతోషకరమైన పరిణామంగా భావిస్తున్నారు.

జి.వి.కె.రెడ్డి స్వగృహం వేదికగా జరిగిన ఈ పరిచయ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి రామనారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిలతో పాటు కాంగ్రెస్ నాయకులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సి.వి.శేషారెడ్డి, డి.సి.సి బ్యాంక్ అధ్యక్షులు వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, జె.వి.రెడ్డి, మేనకూరు రమణారెడ్డి, టంగుటూరు ఉదయ్ కుమార్‌రెడ్డి, బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి, మాదాసు గంగాధరం, ఇందుకూరుపేట, జగదేవిపేట, కొత్తూరు, మైపాడు ప్రాంత స్థానిక నాయకులు, కార్యకర్తలు జి.వి.కె, తిక్కవరపు కుటుంబ ఆత్మీయులు, అభిమానులు వేలసంఖ్యలో పాల్గొన్నారు.



## మామ గెలుపుకి

# కృషి చేద్దాం!

### - జి.వి.సంజయ్‌రెడ్డి

జి.వి.కె. కుమారుడు, టి.యస్.ఆర్. అల్లుడు జి.వి.సంజయ్‌రెడ్డి కొత్తూరు కార్యక్రమంలో ఆకర్షణగా నిలిచాడు. చాలారోజుల తర్వాత గ్రామానికొచ్చిన సంజయ్, తన చిన్ననాటి స్మృతులను నెమరువేసుకున్నారు. తమ ఊరి జనాన్ని ఆప్యాయంగా పలకరించారు. అడిగిన వారందరితో ఫోటో కోసం ఓపిగ్గా నిల్చుని తమ సంస్థల్లో చదివే విద్యార్థినీవిద్యార్థులకు ఆటోగ్రాఫ్‌లిచ్చారు. తన మామ సుబ్బరామిరెడ్డి గెలుపు కోసం మనమంతా కలసికట్టుగా శ్రమిద్దాం అంటూ ఆయన ఊరి జనంతో పాటు తమ కుటుంబం అభిమానులకు పిలుపునిచ్చారు. సుబ్బరామిరెడ్డి విశిష్ట వ్యక్తిత్వం కలిగిన వ్యక్తని, ప్రజాసేవంటే ఆయనకు చాలా ఇష్టమని, చెప్పింది చెప్పినట్లు చేయడం ఆయన నైజమని, అలాంటి వ్యక్తిని మీరంతా ఆశీర్వదిస్తే జిల్లాకు మంచి జరుగుతుందన్నారు. ఆయన గెలుపు కోసం తాము సకుటుంబ సపరివారంగా ప్రచారంలో పాల్గొంటామని చెప్పారు. అటు గునపాటివాళ్లు ఇటు తిక్కవరపు వాళ్లు సుబ్బరామిరెడ్డి ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు.



పరిచయసభ వేదికపై అతిథులు అతిరథులు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:232348[illegible] Editor-**THUNGA SIVAPRABHATH REDDY**, Executive Editor-**G.SREENIVASULU REDDY**.